ప్రజాశక్తి

ఆదివారం 26 నవంబర్ 2023 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

అక్రమ రవాణా

- దొనబండ టు బందరు పోర్ట్
- పోర్టు నిర్మాణం మాటున క్వారీలు లూటీ
- బిల్లులు లేకుండానే బండ రాళ్లు తరలింపు
- నామమాత్రపు కేసులు, జరిమానాలు
- ప్రభుత్వ ఆదాయానికి గండి

ఎన్‌టిఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం, కంచికచర్ల మండలాల్లోని దొనబండ, పరిటాల ప్రాంతాల నుంచి కృష్ణా జిల్లా కేంద్రమైన బందరుకు కొండ రాళ్ల అక్రమ రవాణా నిరంతరాయంగా సాగుతోంది. క్వారీ బిల్లులు లేకుండానే బందరులో పోర్టు నిర్మాణానికి బండ రాళ్లను డంపర్లు (పెద్ద టిప్పర్లు)లో భారీగా తరలిస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి పెద్దమొత్తంలో గండికొడుతున్నారు. అప్పుడప్పుడు కేసులు నమోదు చేస్తూ నామమాత్రంగా జరిమానాలు విధిస్తూ అధికార యంత్రాంగం అక్రమాలకు సహకరిస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఐదు నెలలుగా జరుగుతున్న ఈ రవాణాలో కేవలం 18 వాహనాలకు నామమాత్రపు జరిమానాలు విధించడమే దీనికి నిదర్శనంగా నిలుస్తోంది.

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

బందరు పోర్టులో నార్త్, సౌత్ బ్రేక్ వాటర్ నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. బ్రేక్ వాటర్ నిర్మాణానికి అవసరమైన బండ రాళ్లు ఎన్‌టిఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం దొనబండ, కంచికచర్ల మండలం పరిటాల ప్రాంతాల క్వారీల నుంచి రోజూ తరలిస్తున్నారు. 40 టన్నులకుపైగా బరువుతో వెళ్లే డంపర్ వాహనాల బరువుకు బందరు-విజయవాడ మధ్య నూతనంగా నిర్మించిన జాతీయ రహదారి సైతం అనేక చోట్ల బీటలు వారింది. 182 డంపర్లలో రోజువారీగా బండ రాళ్ల సరఫరా అవుతున్నాయి. సాధారణంగా బండ రాళ్ల సరఫరా చేసే డంపర్లకు సంబంధించి వెయిటేజీ, దాని విలువలను నిర్ధారిస్తూ క్వారీల వద్ద బిల్లులు తీసుకోవాలి. కానీ నూటికి 10 శాతం డంపర్లకు మాత్రమే బిల్లులు తీసుకుంటున్నారు. 90 శాతం డంపర్లలో బిల్లులు లేకుండానే బండ రాళ్లను రవాణా చేస్తున్నారు. తద్వారా క్వారీల నుండి ప్రభుత్వానికి వెళ్లాల్సిన (మిగతా 6లో)

మైనింగ్ అధికారులు స్వాధీనం చేసుకున్న బండరాళ్లు రవాణా చేస్తున్న డంపర్

బండ రాళ్ల అక్రమ రవాణాను సహించం

కొండారెడ్డి, మైనింగ్ ఎడి, కృష్ణాజిల్లా

క్వారీ బండ రాళ్ల అక్రమ రవాణాను సహించబోమని మైనింగ్ శాఖ ఎడి కొండారెడ్డి చెప్పారు. నిరంతరం తనిఖీలు చేపడుతున్నామని తెలిపారు. ఈక్రమంలోనే 18 వాహనాలకు సంబంధించి కేసులు నమోదు చేశామని తెలిపారు. ఇక ముందు కూడా పటిష్ట నిఘా ఉంచి అక్రమాలు జరగకుండా చూస్తామన్నారు. అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'శ్రీ చైతన్య' బస్సులో మంటలు

- డ్రైవర్, స్థానికుల అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం
- సురక్షితంగా బయటపడిన 40 మంది విద్యార్థులు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : శ్రీ చైతన్య స్కూల్‌కు చెందిన బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. డ్రైవర్ అప్రమత్తతతో విద్యార్థులకు పెద్ద ప్రమాదం తప్పింది. ఈ సంఘటన ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేటలో శనివారం జరిగింది. మండలంలోని బలుసుపాడు, అన్నవరం తదితర గ్రామాల నుంచి విద్యార్థులను పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్‌కు ఉదయం సమయంలో ఆ పాఠశాల బస్సులో తీసుకువస్తున్నారు. పట్టణంలోని క్రిస్టియన్ పేట సమీపంలోకి రాగానే బస్సు నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ బస్సును రోడ్డు పక్కకు పోనిచ్చి నిలిపివేశాడు. చుట్టుపక్కల వారికి సమాచారం ఇచ్చాడు. దీంతో బస్సులో ఉన్న 40 మంది పిల్లలను డ్రైవర్, స్థానికులు (మిగతా 6లో)

మంటలు చెలరేగిన ప్రదేశం

ప్రమాదానికి కారణమైన బస్సు

వార్త మెయిన్‌లో

ఇంటెలిజెన్స్ డిఎస్‌పి హఠాన్మరణం

- తిరుమల నడకదారిలో ఘటన
- ప్రధాని భద్రతా ఏర్పాట్ల పర్యవేక్షణకు వెళ్లిన అధికారి

అస్తవ్యస్తంగా రోడ్లు

- ఎన్టీఆర్ జిల్లాలో 200 కిమీ పొడవున పనులకు నిర్ణయం
- ఆరు నెలల టెండర్ల ప్రక్రియ పూర్తి
- ఆసక్తి చూపని గుత్తేదారులు
- నిధుల విడుదలలో ప్రభుత్వం నిర్లక్ష్యం

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

ఎన్టీఆర్ జిల్లాలో రహదారులు గుంతల మయంగా ఉన్నాయి. మేజర్ జిల్లా రహదారులు (ఎండిఆర్)తోపాటు జిల్లాలో నుండి వెళ్లే రాష్ట్ర రహదారులు (ఎస్‌హెచ్), ఇతర జిల్లా రోడ్ల (ఓడిఆర్) పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. దీంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు, వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో దాదాపు 700 కిలో మీటర్ల మేర జిల్లా మేజర్ రోడ్లు ఉన్నాయి. వీటిలో విజయవాడ ఆర్‌అండ్‌బి డివిజన్ పరిధిలో 386.429 కిలో మీటర్లు, మైలవరం ఆర్‌అండ్‌బి డివిజన్ పరిధిలో 310.410 కిలో మీటర్ల మేర ఉన్నాయి. ఇతర జిల్లా రహదారులు విజయవాడ పరిధిలో 98.310 కిలోమీటర్లు, మైలవరం పరిధిలో 80.770 కిలోమీటర్ల వరకు ఉన్నాయి. వీటితోపాటు రాష్ట్ర రహదారులు విజయవాడ డివిజన్ కింద 268.333 కిలో మీటర్లు, (మిగతా 6లో)

నకిలీ మిర్చి నారు బాధిత రైతులకు

పెండింగ్ నష్టపరిహారం చెల్లించాలి

- **రైతు సంఘం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి పివి.ఆంజనేయులు డిమాండ్**

ప్రజాశక్తి - విజయవాడ, గంపలగూడెం : ఎన్‌టిఆర్ జిల్లా గంపలగూడెం మండలం పెనుగొలను, ఊటుకూరు గ్రామాల్లో నకిలీ మిర్చి నారుతో నష్టపోయిన రైతులను, కౌలు రైతులకు చెల్లించాల్సిన పెండింగ్ నష్టపరిహారాన్ని వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పగడాల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. 2016-17 వ్యవసాయ సీజన్లో నకిలీ మిర్చి నారుతో నష్టపోయిన ఆయా గ్రామాలకు చెందిన బాధితులకు పెండింగ్ నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ శనివారం విజయవాడలోని వ్యవసాయ శాఖ జెడి కార్యాలయం వద్ద రైతు సంఘం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో పివి ఆంజనేయులు (మిగతా 6లో)

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి, చిత్రంలో శ్రీదేవి, సరోజ తదితరులు

మహిళల్లో ప్రశ్నించే తత్వం పెరగాలి : ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

వార్త 8లో

పెండ్యాల వైసిపిలో ఆధిపత్య పోరు

ఎంఎల్‌సి సాక్షిగా ఎంపిపిని ప్రచార రథం నుండి దించేసిన ఎంపిటిసి అనుచరులు

ప్రజాశక్తి - కంచికచర్ల : మండలంలోని పెండ్యాల గ్రామంలో అధికార వైసిపిలో ఆధిపత్య పోరు తారాస్థాయికి చేరి దాడులు చేసుకునేంత వరకూ వెళ్లింది. శనివారం రాత్రి పెండ్యాల గ్రామంలో ఎంపిటిసి షేక్ బడే హాజరత్ ఆధ్వర్యాన "రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఎల్‌సి డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ హాజరయ్యారు. అయితే అదే గ్రామానికి చెందిన ఎంపిపి షేక్ మలక్ బషీర్‌ని ఎంపిటిసి గ్రూపువారు పిలవలేదు. ఎంఎల్‌సి అరుణ్‌కుమార్ రాగానే, ఎంపిటిసి బడే హాజరత్ గ్రూపువారు బైక్ ర్యాలీతో స్వాగతం పలికారు. ఈర్యాలీలో ప్రచార రథంపై ఉన్న ఎంఎల్‌సి అరుణ్ కుమార్...రోడ్డు పక్కన ఉన్న ఎంపిపి బషీర్ పిలిచి ప్రచార రథం ఎక్కించారు. ఇందుకు బషీర్‌కు వ్యతిరేకంగా ఉన్న ఎంపిటిసి అనుచరులు ఒప్పుకోలేదు. ఎంపిపి బషీర్ ఈ ర్యాలీలో పాల్గొనటానికి వీల్లేదని, తాము ఆయనను పిలవలేదని, ప్రజాప్రతినిధిగా ఆయనను గుర్తించటంలేదని కేకలు వేశారు. బషీర్ ప్రచార రథం దిగి వెళ్లిపోవాలని రథాన్ని నిలిపి వేశారు. దీంతో తాను ఎంపిపినని, తనను ఎవరు ఆపేదని బషీర్ వాగ్వాదానికి దిగారు. దీంతో కోపోద్రిక్తులైన ఎంపిటిసి గ్రూపు వారు ఎంఎల్‌సి సాక్షిగానే ఎంపిపిని రథం నుండి కిందకు తోశారు. దీంతో పరిస్థితి చేయి దాటుతోందని గ్రహించిన ఎంఎల్‌సి అరుణ్‌కుమార్ వారికి సర్దిచెప్పి ఎంపిపిని ఇంటి వద్ద దింపారు.

మాట్లాడుతున్న డాక్టర్ జగదీశ్, తదితరులు

ఆస్టర్ రమేష్ ఆస్పత్రిలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు ఆస్టర్ రమేష్ అమరావతి ఆసుపత్రిలో బర్డ్ ఆసుపత్రి మాజీ డైరెక్టర్ డాక్టర్ గుడారు జగదీష్ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక ఆర్థోపెడిక్ వైద్య శిబిరం నిర్వహించారు. 50 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, శస్త్రచికిత్స అవసరం ఉన్నవారిని గుర్తించారు. ఆధునిక వైద్య సదుపాయాలు కలిగిన ఆస్టర్ రమేష్ అమరావతి ఆసుపత్రిలో వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మెట్రోపాలిటన్ నగరాలలోని ఆస్పత్రులకు దీటుగా తిరువూరులోని అమరావతి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్వహిస్తున్నారని అయన మేనేజ్మెంట్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి చైర్మన్ కోనేరు వెంకట కృష్ణన్, వైద్యులు నెక్కలపు కృష్ణ చైతన్య, కొల్ల మధుకీర్తి, కోనేరు కావ్య, ఆస్టర్ రమేష్ అమరావతి ఆస్పత్రి సీనియర్ జనరల్ మేనేజర్లు కోటేశ్వరరావు, జహీర్, సిబ్బంది పాల్గొన్నారు.

సిపిఐ కార్యదర్శికి పితృవియోగం

ప్రజాశక్తి - గంపలగూడెం : మండల సిపిఐ కార్యదర్శి ఉన్నం సాంబయ్య తండ్రి లక్ష్మయ్య (80) మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. కాగా, సొబ్బాల గ్రామానికి చెందిన లక్ష్మయ్య కొద్ది రోజులుగా అస్వస్థతతో బాధపడుతూ, శనివారం సాయంత్రం 6 గంటలకు మృతిచెందారు. లక్ష్మయ్య మతదేహాన్ని సిపిఎం మండల కమిటీ సందర్శించి నివాళు లర్పించింది. కార్యదర్శి గువ్వల సీతారామిరెడ్డి, నాయకులు చెరుకు వీరారెడ్డి, మద్దిరెడ్డి వెంకటరెడ్డి ఉన్నారు.

క్రిస్మస్ వేడుకలు ప్రారంభం

ప్రజాశక్తి - భవానీపురం : విద్యాధరపురం కొట్టేటి కోటయ్య వీధి షాలేము మినిస్ట్రీస్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు (మండల దినములు) శనివారం వైభవో పేతంగా ప్రారంభ మయ్యాయి. షాలేము మినిస్ట్రీస్ నిర్వాహకులు రెవ పుట్ల సత్య వేదం ఆధ్వర్యంలో శనివారం పలు కార్యక్రమాలు అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రారంభించారు. ఈ మండల దినాల్లో క్రీస్తు మానవాళికి అందించిన బోధనల్లో పలువురు పాల్గొని ఆనందములతో ప్రభువును అనుసరిస్తూ క్రిస్మస్ ప్రార్థనలో పాల్గొన్నారు. నూతన సంవత్సరం మొదటి వారం వరకు ఈ కార్యక్రమాలలో సంఘస్తులందరూ పాల్గొనాలన్నారు. క్రిస్మస్ గీతాలతో అనేక ప్రత్యేక కార్యక్రమాలు, డిబేట్స్ మరియు సెమీ క్రిస్మస్ ఆరాధనలు, కేరల్ సర్వీసెస్ స్కిట్లు పంపిణీ చేసుకుని సందడి చేశారు. అభినయాలు నత్యాలు మొదలైన వాటితో ప్రతిరోజు ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కుల మతాలకు అతీతంగా ఈ మండల దినాల్లో పాల్గొనాలని కోరారు. ప్రతిరోజు వేకువజామున 5 గంటలకు దేవాలయంలో ప్రార్థనలు జరిపి భక్తిశ్రద్ధలతో ఈ మండల దినాలు గడుపుతామన్నారు. అనేకమంది భక్తులు సంఘ పెద్దలు కోటా రవికుమార్, టికాటి విజయ్ కుమార్, అందుగుల సాల్మన్ రాజ్, గంధం ఏస్తేరు విద్యా రాణి, భవ్య శ్రీ, దిబ్బ మనీ బాబు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ విద్యార్థుల విదేశీ విద్యకు మంగళం

ప్రజాశక్తి - నందిగామ : మైనార్టీ విద్యార్థులకు విదేశీ విద్య పథకానికి జగన్ ప్రభుత్వం మంగళం పాడిందని టిడిపి నాయకులు విమర్శించారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ కరిముల్లా మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో మైనార్టీ విద్యార్థులకు అంబేద్కర్ ఓవర్సీస్ విద్య (విదేశీ విద్యా) పథకం ద్వారా చదువుకునేందుకు సాయం అందేదని, ఎంతోమంది పిల్లలు విదేశాలకు వెళ్లి చదువుకుంటున్నారని, దానికయ్యే ఖర్చు అప్పటి చంద్రబాబు ప్రభుత్వం భరించిందని అన్నారు. జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత పథకాన్ని నిర్వీర్యం చేసి, విదేశాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు అందవలసిన సాయాన్ని అందించకుండా క్షోభకు గురి చేశారన్నారు. అసలే వారంతా పేద మధ్యతరగతి విద్యార్థులని, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని అన్నారు. విదేశాల్లో చదువుకుంటున్న విద్యార్థుల కుటుంబాలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయన్నారు.

రివిజన్ చేస్తున్న జయరాం

సార్వత్రిక ఎన్నికల వర్క్‌షాప్

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణంలో మున్సిపల్ కార్యాలయంలో అసిస్టెంట్ ఎలక్టోరల్ ఆఫీసర్ డా.జయరాం ఆధ్వర్యంలో రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి బియల్‌ఒలతో స్పెషల్ రివిజన్ ఎలక్షన్ వర్క్ శనివారం నిర్వహించారు. బియల్‌ఒలకు తగు సూచనలు ఇస్తూ ఎలక్షన్ వర్కు వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ ఫణి శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

ప్రజాశక్తి - మైలవరం : స్థానిక డాక్టర్ లక్కిరెడ్డి హామిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు రాజ్యాంగం ఆవశ్యకత గురించి వివరించారు. రాజ్యాంగ పరిషత్ ఎన్నికలు, రాజ్యాంగ నిర్మాణం, కమిటీలు ఏర్పాటును తెలుపుతూ రాజ్యాంగ నిర్మాణంలో అంబేద్కర్ చేసిన కషిని వివరించారు. భారత రాజ్యాంగంపై నేషనల్ స్థాయిలో క్విజ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగ్యాపకులు ఎం దేవానంద్ కుమార్, ఎస్ కే కరీముల్లా, సుభాషిని విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

నందిగామ : ప్రతి ఒక్కరికీ రాజ్యాంగం పరిరక్షణ కోసం పని చేయాలని వక్తలు పేర్కొన్నారు. రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా నందిగామ కెవిఆర్ కళాశాలలోని సోషల్ సైన్సెస్ శాఖ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య నివేదిక సహకారంతో కళాశాల విద్యార్థులకు భారత రాజ్యాంగంపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాయప్ప అధ్యక్షత వహించారు.

నందిగామాలో అవగాహనా ర్యాలీ

నందిగామ : భారత రాజ్యాంగం దినోత్సవం, యాంటీ డౌరీ డే పురస్కరించుకొని శనివారం నందిగామ 16వ అదనపు జిల్లా కోర్టు ప్రాంగణం నుండి గాంధీ సెంటర్ వరకు న్యాయమూర్తులు, న్యాయవాదులతో కలిసి ప్రత్యేకర్యాలీ నిర్వహించారు. నందిగామ జిల్లా కోర్టు 16వ అదనపు న్యాయమూర్తి వి.శ్రీనివాసరావు మాట్లాడారు. అవగాహన ర్యాలీలో నందిగామ సీనియర్ సివిల్ జడ్జి వి.లక్ష్మి రాజ్యం, అదనపు జూనియర్ సివిల్ జడ్జి షేక్ రియాజ్, నందిగామ ఎసిపి జనార్ధన్ నాయుడు, నందిగామ ఆర్డీవో పి.సాయిబాబు, తహశీల్దారు నరసింహారావు పాల్గొన్నారు.

దుర్గగుడి తాత్కాలిక ఉద్యోగి ఆత్మహత్య

ప్రజాశక్తి - వన్‌టౌన్ : దుర్గగుడిలో పనిచేస్తున్న ఓ తాత్కాలిక ఉద్యోగి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు వన్‌టౌన్ మల్లికార్జునపేట, ఆకులవారి వీధిలో పోతురెండి ప్రసాద్ కుటుంబం నివాసం ఉంటున్నారు. ప్రసాద్ పది సంవత్సరాలుగా కనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో అన్నదానంలో పనిచేస్తుంటాడు. వీరి తమ్ముడు ప్రసాద్ (చిన్న ప్రసాద్) (29) కనకదుర్గ అమ్మవారి గుడిలో బోయ (అమ్మవారి పల్లకి సేవ) గా పనిచేస్తుంటాడు. ఈనెల 24వ తేదీ రాత్రి ఎప్పటిలాగానే తన గదిలో పడుకున్నాడు. మరునాడు 25వ తేదీ ఉదయం 7.30 గంటలకు వీరి తల్లి నాగమణి లేపడానికి తలుపు కొట్టగా ఎంత సేపటికి నిద్ర లేవలేదు. కిటికీ నుంచి చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించాడు. తలుపులు పగలకొట్టి చూడగా అప్పటికే ప్రసాద్ చనిపోయి వున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫిట్‌నెస్‌లేని పాఠశాల బస్సులపై చర్యలు తీసుకోవాలి: ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని, పాఠశాల బస్సులను రవాణా శాఖ అధికారులు తనిఖీలు చేసి నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు జి.గోపి నాయక్ డిమాండ్ చేశారు. పట్టణంలోని డివిఆర్ నగర్‌లో గల సుందరయ్య భవన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు జి.గోపినాయక్ మాట్లాడారు. జగ్గయ్యపేట పట్టణంలో క్రిస్టియన్ పేట దగ్గర శ్రీ చైతన్య పాఠశాల బస్సుకు షార్ట్ సర్క్యూట్ అయి మంటలు వ్యాపించాయని, పాఠశాల బస్సులో విద్యార్థులకు భద్రత లేకుండా పోయిందని అన్నారు. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా ఉన్నా కార్పొరేట్ పాఠశాలలు ఫిట్‌నెస్ లేకుండా, బస్సులో విద్యార్థులకు

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సరైన సదుపాయాలు లేకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నా కార్పొరేట్ విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని, స్కూల్ బస్సులో పరిమితులకు మించి విద్యార్థులను విపరీతంగా ఎక్కిస్తున్నా అధికారులు చర్యలు మాత్రం తీసుకోవడం లేదన్నారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.సోమేశ్వరరావు, కమల్ పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - విజయవాడ : పేద ప్రజలు ఆరోగ్యంగా, ఆనందంగా జీవించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వైద్య రంగంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. నియోజకవర్గంలో నలుగురికి మంజూరైన రూ. 3.08 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనములో శనివారం ఎమ్మెల్యే చేతులమీదుగా అందజేశారు. అనంతరం మల్లాది విష్ణు మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఈ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. వైద్య రంగంలో సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీసుకొచ్చిన సంస్కరణలు పేదలకు ఎంతో మేలు చేకూరుస్తున్నాయన్నారు. ఇప్పటికే జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను విజయవంతంగా నిర్వహించుకున్నామని.. తెలిపారు.

మహాధర్నా విజయవంతం చేయాలని కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి -విజయవాడ : మోడీ బిజెపి కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలకు నిరసనగా ఈనెల 27, 28 తేదీలలో జింఖానా గ్రౌండ్‌లో జరిగే కార్మిక రైతు మహాధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ శనివారం బిఆర్‌టిఎస్ రోడ్డులోని నండూరు ప్రసాదరావు భవన్లో విజయవాడ సెంట్రల్ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో విస్తత సమావేశం జరిగింది. అనంతరం కరపత్రాల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు సెంట్రల్ సిటీ అధ్యక్షులు కె.దుర్గారావు మాట్లాడుతూ ఆటో, మోటార్ కార్మికులపై బిజెపి ప్రభుత్వం కక్ష కట్టి వేల రూపాయలు జరిమాణాలు కఠినమైన శిక్షలు వేసే విధంగా చట్టాలను మోడీ ప్రభుత్వం తీసుకొస్తోందని, నిత్యావసరాల ధరలు పెరిగిపోతున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.హనుమంతరావు, నాయకులు వై.దుర్గారావు, ఎస్.కె బాజీ, ఎస్.కె ఫరీద్, అబ్దుల్ రెహామాన్ సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్ పాల్గొన్నారు.


విజయవాడలో

కంచికచర్ల : మహా ధర్నాను జయప్రదం చేయాలని కౌలు రైతులు సంఘం జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు పిలుపునిచ్చారు. శుక్రవారం కంచికచర్లలో గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులు, ఇతర కార్మికుల ఆధ్వర్యంలో మహాధర్నా జయప్రదం కోరుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ కుమార్, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

వన్‌టౌన్‌లో

వన్‌టౌన్ : రైతు కార్మిక దేశవ్యాప్త పిలుపు భాగంగా నవంబర్ 27, 28వ తేదీల్లో విజయవాడ జింఖానా క్లబ్ గ్రౌండ్‌లో జరిగే మహా ధర్నాను జయప్రదం చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సిఐటియు గౌరవాధ్యక్షులు బోయి సత్యబాబు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో చిట్టినగర్‌లో గల సర్కిల్ వన్ కార్మికుల జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షులు, కార్పొరేటర్ బి.సత్యబాబు మాట్లాడారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు లక్ష్మీ, దుర్గ పాల్గొన్నారు.

వత్సవాయి : రైతు సంఘం మండల కార్యదర్శి తమ్మినేని రాంబాబు, కౌలు రైతు సంఘం మండల కమిటీ సభ్యులు తమ్మినేని రమేష్ పిలుపునిచ్చారు.

మహాధర్నాను జయప్రదం చేయండి

గుడివాడలో...

బాపులపాడు మండలంలో..

ప్రజాశక్తి - గుడివాడ : సిఐటియు అనుబంధం భవనం, ఇతర నిర్మాణ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో 27,28 తేదీలలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని గుడివాడ భవన నిర్మాణ కార్మిక సంఘం పట్టణ కార్యదర్శి రేపాని కొండ కోరారు. శనివారం. కష్ణాజిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం గుడివాడ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కొండ మాట్లాడుతూ వైఎస్ఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుని 12,14 మెమో తీసుకొచ్చి భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డుని నిలిపివేయడం జరిగిందన్నారు. కార్మికుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోర్టులను రద్దు చేయాలని, భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఇసుక సిమెంట్ ఐరన్ మొదలైన నిర్మాణ సామాగ్రి ధరలు తగ్గించాలని, ప్రభుత్వం తీసుకున్న సంక్షేమ బోర్డు నిధులను వెంటనే జమ చేయాలని, భవన నిర్మాణ కార్మికునికి సొంత ఇంటి నిర్మాణానికి ప్రభుత్వ లోన్లు ఇవ్వాలని, అర్హులైన భవన నిర్మాణ కార్మికులందరికీ వద్ధాప్య, వితంతు, వికలాంగ పెన్షన్ ఇవ్వాలని తదితర డిమాండ్ల గురించి సభలో తెలియజేస్తున్నారన్నారు. కాబట్టి విజయవాడ జింఖానా గ్రౌండ్ లో జరిగే సభకు వేలాదిమంది కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుడివాడ భవన నిర్మాణ కార్మిక సంఘం పట్టణాధ్యక్షులు దాసు శ్యాంప్రసాదు, మురాల కోటమ్మ, మూడెడ్ల నారాయణ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి హనుమాన్ జంక్షన్ :** కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక,కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ.. 27,28 తేదీలలో విజయవాడ జింఖానా గ్రౌండ్ లో జరిగే మహా ధర్నాను విజయవంతం చేయాలని బాపులపాడు మండలం రంగన్నగూడెం గ్రామంలో ఆళ్ల గోపాలకృష్ణారావు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల అంశమైన వ్యవసాయాన్ని, విద్యుత్ శక్తిని ఆధీనంలోకి తీసుకుని భారతదేశ వ్యాప్తంగా 24 కోట్ల విద్యుత్ సర్వీసులకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు పెట్టాలని నిర్ణయించిందన్నారు. దీనిని ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో రైతు సర్పంచ్ కసుకుర్తి రంగా మణి, ఎంపీటీసీ సభ్యులు పుసులూరు లక్ష్మీనారాయణ సంఘాల సమన్వయ సమితి నాయకులు తుమ్మల వెంకటేశ్వరరావు, కొలుసు వెంకట రాంబాబు పాల్గొన్నారు.

బీమా అందజేస్తున్న వీరంకి చిరంజీవి

వైఎస్సార్ బీమా అందజేత

ప్రజాశక్తి-పమిడిముక్కల : వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రజా సంక్షేమ ప్రభుత్వమని, నవరత్నాలతో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని వైయస్సార్ పార్టీ నాయకులు వీరంకి చిరంజీవి అన్నారు. శనివారం మండలంలోని కృష్ణాపురం గ్రామంలో ఇటీవల చనిపోయిన కొండవీటి గిడ్డు కుటుంబానికి వైయస్సార్ బీమా 10 వేల రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న వారికి ఆసరాగా ఈ బీమా ఉపయోగపడుతుందని ఆయన అన్నారు.

బ్లడ్ గ్రూపుల నిర్ధారణ శిబిరం

ప్రజాశక్తి-గన్నవరం : స్థానిక ఎన్టీఆర్ పశు వైద్య కళాశాల, గన్నవరం ఎన్ ఎస్ ఎస్ విభాగం వారు, గన్నవరం రెడ్ క్రాస్ బ్రాంచ్ వారి సహకారంతో బ్లడ్ గ్రూపుల నిర్ధారణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి వి ఎస్ కిషోర్ గారు రెడ్ క్రాస్ యొక్క ఆవశ్యకత మరియు రక్తదానం వలన కలిగే ఉపయోగాలు వివరించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ గన్నవరం బ్రాంచ్ వ్యవస్థాపకులు డాక్టర్ మద్దుకూరి విజయ్ కుమార్ పాల్గొని గన్నవరంలో చేపట్టిన కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గన్నవరం రెడ్ క్రాస్ బ్రాంచ్ చైర్మన్ చిన్ని మాధవి, వైస్ చైర్మన్ డాక్టర్ కె రాజ్ కిషోర్, మల్లికార్జున విద్యాసంస్థల చైర్మన్ ఎన్సివి రాయుడు, డాక్టర్ వసంత, డాక్టర్ కష్ణ దీపిక మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

మృతుడికి నివాళి

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని విన్నకోట గ్రామ శివారు జేమ్సుపేటగూడెంకు చెందిన జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుల్లా త్యాగరాజు కింగ్ తండ్రి బుల్లా ప్రభాకర్ రావు అనారోగ్య కారణంగా శనివారం మరణించారు. ప్రభాకర్ రావు పార్ధివదేహానికి టిడిపి పార్టీ నాయకులు వెనిగండ్ల రాము పూలమాల వేసి నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం వయా ఉంగుటూరు పుట్టగుంట వరకు రూ. 35 కోట్ల రూపాయలతో చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనులకు శనివారం అధికారులు మార్కింగ్ పనులు చేపట్టారు. ఆర్ అండ్ బి అధికారులు వెంకటేశ్వర థియేటర్ సెంటర్లో రోడ్డు విస్తరణకు అవసరమైన కొలతలు వేసి మార్కింగ్ చేశారు. ఆక్రమణలు తొలగించాలని షాపుల నిర్వాహకులకు ఆదేశాలు ఇచ్చారు. గత ఐదేళ్లుగా ఈ రోడ్డు విస్తరణ కాకపోవడంతో కొంతమంది షాపులో నిర్వాహకులు రోడ్డు ను ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేయడం జరిగింది. దీంతో ట్రాఫిక్ సమస్య పెరిగిపోయి వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్య తెలుసుకున్న ఎమ్మెల్యే వంశీ, సీఎం జగన్ తో మాట్లాడి 35 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేయించారు. ఈ రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆర్ అండ్ బి అధికారులు రంగంలోకి దిగి పనులు మొదలు పెట్టారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-అవనిగడ్డ : పంచాయతీ పరిధిలోని ఎనిమిదో వార్డుకు చెందిన చింతా కొర్నేల్ హార్ట్ ఎటాక్ తో మరణించగా విషయం తెలుసుకున్న శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులు తోట శ్యాం కిషోర్ నాయుడు కొర్నేల్ ఇంటికి వెళ్లి ఆయన భౌతిక దేహాన్ని సందర్శించి మట్టి ఖర్చుల నిమిత్తం ఐదువేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో డి భాస్కర్, నాగమల్లి, ఎం ప్రసాద్, సి కుమార్ పాల్గొన్నారు.

కెయులో 76వ ఎన్‌సిసి దినోత్సవం

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : కృష్ణా యూనివర్సిటీలో 76వ ఎన్సిసి దినోత్సవాన్ని అసోసియేట్ ఎన్సిసి అధికారి లెఫ్టినెంట్ డా.డి.రామశేఖర రెడ్డి ఆధ్వర్యంలో శనివారం అల్లూరి సీతా రామరాజు ఆడిటోరియంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ జి.జ్ఞానమణి హాజరయ్యారు. కృష్ణా యూనివర్శిటీ రిజిస్ట్రార్ డా.పి.వీర బ్రహ్మచారి క్యాడెట్లను ఉద్దేశించి మాట్లాడుతూ రానున్న రోజుల్లో మన కృష్ణా యూనివర్సిటీ ఎన్‌సీసీ విభాగం జిల్లాలోనే అగ్రస్థానంలో నిలుస్తుందని అన్నారు. అనం తరం కృష్ణా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డా.ఆర్.విజయ కుమారి మాట్లా్ాడారు. ఎన్సిసి అధికారి లెఫ్టినెంట్ డా.డి.రామశేఖరరెడ్డి క్యాడెట్లతో భారతదేశంలో ఎన్సిసి ఆవిర్భావం గురించి వివరించారు.

చోరంపూడిలో 'గడపగడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-బంటుమిల్లి : దేశంలో ఎక్కడా లేనివిధంగా జగనన్న ప్రభుత్వం విప్లవాత్మకమైన ఆదర్శ సంక్షేమ పాలన నిజాయితీగా నిష్పక్షపాతంగా అందిస్తుందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ పేర్కొన్నారు. మండలంలో చోరంపూడిలో నిర్వమించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. జగన్మోహన రెడ్డి ప్రభుత్వం చేస్తున్న అభివద్ధి,సంక్షేమ పథకాలను వారికి వివరించారు. ప్రజలు వివిధ సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ది వివరాలతో కూడిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంతకం చేసిన కరపత్రాలను ఈ సందర్భంగా వారికి అందజేశారు. చోరంపూడి గ్రామ సర్పంచ్ రేవు నాగలక్ష్మి గోపాలకష్ణ, బంటుమిల్లి ఎంపీపీ వెలివల చిన్నబాబు, ఎంపీటీసీ తిరుమలశెట్టి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల లబ్ధిదారుల పేర్లు ప్రదర్శించాలి


కోడూరులో...

గుడ్లవల్లేరులో..

ప్రజాశక్తి-కోడూరు : ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అసైన్డ్ భూముల లబ్ధిదారుల పేర్లను గ్రామ/వార్డు సచివాలయంలో వద్ద బహిరంగ నోటీసులో ఉంచాలని కోడూరు మండలం తాసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తాసిల్దార్ కు శనివారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం కోడూరు మండల కమిటీ సభ్యులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు పలుమార్లు పేదలకు పంపిణీ చేసిన అసైన్డ్ భూములను ప్రస్తుత ప్రభుత్వం లబ్ధిదారులకు శాశ్వత హక్కు (అమ్ముకోవడానికి, కొనుక్కోవడానికి) కల్పించే ఉద్దేశంతో 9/77 చట్ట సవరణ చేసిందని, కానీ ఈ భూములు అన్యాక్రాంతమై అనేకమంది పెత్తందారుల చేతుల్లో ఉన్నాయన్నారు. ప్రభుత్వం ఆదేశాలు అమలు జరిగేలా గ్రామ/ వర్డ్ సచివాలయాల వద్ద బహిరంగ నోటీసు బోర్డు నందు పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలాబత్తిన మోహనరావు, కోట వీరయ్య, పోలాబత్తిన రాంబాబు, కైలా యేసు పాధం పాల్గొన్నారు.**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** మండలంలోని అసైన్డ్ భూముల లబ్ధిదారుల పేర్లను గ్రామ వార్డు సచివాలయాలలో బహిరంగ నోటీసు నందు ఉంచాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో డిప్యూటీ తసీల్దార్ కనకకదుర్గ కు శనివారం వినతి పత్రాన్ని అందించారు. .ఈ సందర్భంగా మండల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పిడుగు దేవసహాయం, నాయకులు పెయ్యల సురేష్, జిల్లా నాయకులు బి.వి.శ్రీనివాసరావు లు మాట్లాడుతూ ఈ అసైన్డ్ భూములు జిల్లాలో 33 వేలు ఉండగా అందులో అత్యధిక భాగం అన్యాక్రాంతమైన అనేక మంది పెత్తందారుల చేతుల్లోకి వెళ్లిపోయాయని అన్నారు. వాస్తవ లబ్ధిదారుల పేర్లను బహిరంగ నోటీసులో ఉంచితే ఈ వివరాల ఆధారంగా పరిశీలించటానికి వీలుగా ఉంటుందని అన్నారు.

మంగినపూడి బీచ్‌కు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : కార్తీక పౌర్ణమి సందర్భంగా మచిలీపట్నం కోనేరు సెంటర్,మచిలీపట్నం బస్సు స్టేషన్ నుండి ఆదివారం ఉదయం 5 గంటల నుండి సోమవారం సాయంత్రం వరకు మంగినపూడి బీచ్ కు ప్రత్యేక బస్సు లు ఏర్పాటు చేసినట్లు మచిలీ పట్నం డి పో మేనేజర్ టి పెద్దిరాజు తెలిపారు. ఛార్జి రూ.20 మాత్రమే కావున ఈ ప్రత్యేక బస్సుల సౌకర్యాన్ని భక్తులు, పర్యాటకులు వినియోగించుకోవాలన్నారు.

నకిలీ ఓట్లను తొలగించండి : పేర్ని

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి : మచిలీపట్నం అసెంబ్లీ నియోజక వర్గ ముసాయిదా ఓటరు జాబితాలో నకిలీ ఓట్లు అధికంగా ఉన్నాయని గుర్తించామని మాజీ మంత్రి, మచిలీపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య(నాని) జిల్లా కలెక్టర్‌ను తెలిపారు. ఎన్నికలు నిస్పక్షపాతంగా నిర్వహించేందుకు ముసాయిదా జాబితా లోని లోపాలను సవరించి తుది ఓటరు జాబితాను రూపొందించాలని కోరారు. ఈ మేరకు కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ పి. రాజాబాబును కలిసి నాని శనివారం వినతిపత్రం అందించారు. తొలుత కలెక్టరేట్ ఆవరణలో మీడియాతో మాట్లాడుతూ 2019 సంవత్సరం సార్వత్రిక ఎన్నికలకు ముందు గత ప్రభుత్వ హయాంలోని ఓటరు జాబితా ఆధారంగా తాజాగా ముసాయిదా ఓటరు జాబితా రూపొందిందని చెప్పారు. బందరు నగరపాలక సంస్థలో ఒక్కో డోర్ నంబర్‌లో 50 నుంచి 100 ఓట్లు ఉన్నాయని, డోర్ నంబర్ ఆధారంగా ఇళ్లకు వెళితే ఓటరు జాబితాలో ఉన్న వారు కనిపించడం లేదన్నారు. తెలంగాణా రాష్ట్రంలో ఓట్లు హక్కు ఉన్నవారు 15 వేల మందికి, రూరల్ ప్రాంతానికి చెందిన మరో 10 వేల మంది పేర్లు నగరపాలక సంస్థ ఓటరు జాబితాలో ఉన్నట్లు గుర్తించామని అన్నారు. రెండు చోట్ల ఓట్లు ఉన్న 25 వేల మంది పేర్లను పరిశీలించి బందరు ఓటరు జాబితాలో తొలగించాలన్నారు.

మత్స్యకారులకు ప్రభుత్వ సాయం : విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌లో అగ్ని ప్రమాదాన్ని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రాజకీయం చేస్తున్నారని, పవన్ కళ్యాణ్‌కన్నా ముందుగానే ప్రభుత్వం అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బోటు యజమానులకు రూ. 7.19 కోట్లు పరిహారం అందించిందని పేర్ని నాని తెలిపారు. జరిగిన నష్టాన్ని అంచనా వేసి బాధిత మత్స్యకారులకు రూ. 15 లక్షల నుంచి 33 లక్షలు పరిహారాన్ని ప్రభుత్వం అందించిందన్నారు. వేట నిషేదసమయంలో మత్స్యకారులకు భరోసా ఇవ్వడంతోపాటు సముద్రంలో వేటకు వెళ్లి మృతి చెందిన 159 మత్స్యకార కుటుంబాలకు ఆర్థిక సాయం ప్రభుత్వం అందించిందన్నారు. విశాఖపట్నంలో జగన్ మోహన్‌రెడ్డి క్యాంపు కార్యాలయం నిర్మాణానికి కోట్లు ఖర్చు పెడుతున్నారని ఆరోపిస్తున్న పవన్ కళ్యాణ్, చంద్రబాబు హయాంలో జరిగిన రాజధాని, క్యాంపు కార్యాలయాల పేరుతో జరిగిన వందల కోట్ల వృధా ఖర్చును మాత్రం ప్రశ్నించడం లేదన్నారు.

బిఎస్‌ఎన్‌ఎల్ ఖాళీస్థలం బహిరంగ వేలం ఆపాలి

ప్రజాశక్తి ఇబ్రహీంపట్నం : కొండపల్లిలోని బిఎస్‌ఎన్‌ఎల్ ఖాళీ స్థలం 7176 గజాల స్థలాన్ని భారత్ టెలికాం శాఖ దేశ వ్యాప్తంగా పదిచోట్ల బహిరంగ వేలం పద్ధతిని తక్షణమే యాజమాన్యం విరమించుకోవాలని లేని పక్షంలో ప్రజాస్వామ్య వాదులను, స్వచ్ఛంద సంస్థలను కొండపల్లి ప్రజా శ్రేయస్సు కోరే ప్రతి ఒక్కరినీ కదిలించి బహిరంగ వేలం అడ్డుకుంటామని సిపిఎం కొండపల్లి టౌన్ కమిటీ కార్యదర్శి ఎం.మహేష్ ఒక ప్రకటనలో బిఎస్‌ఎన్‌ఎల్ యాజమాన్యాన్ని హెచ్చరించారు. కేంద్ర బిజెపి పుణ్యమా అని ప్రభుత్వ రంగ సంస్థలో ఖాళీ స్థలాలను కార్పొరేట్ కంపెనీలకు కారుచౌకగా కట్టబెట్టడానికి ఇలాంటి బహిరంగ వేలం ప్రకటనలు ఇవ్వటం దుర్మార్గమన్నారు. కొండపల్లి బిఎస్‌ఎన్‌ఎల్ ఖాళీ స్థలం ప్రభుత్వ ఆఫీసులకు, ప్రజాప్రయోజనాలకు ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన ఉధతం చేస్తామని సిపిఎం మహేష్ హెచ్చరించారు.

గ్రీన్‌డేలో వేడుకల్లో సందడి చేస్తున్న చిన్నారులు

సిద్ధార్థ స్కూల్లో గ్రీన్‌డే వేడుకలు

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు సిద్ధార్థ స్కూల్‌లో గ్రీన్ డే వేడుకలు శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. చిన్నారులు అందరూ గ్రీన్ డ్రస్సులు ధరించి గ్రీన్ కలర్స్ చాట్స్‌తో వివిధ రకాల ప్రదర్శనలు, గ్రీన్ ఫలాలు, గ్రీన్ కూరగాయలు ఎంతో అందంగా తరగతి గదులను అలం కరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరెస్పాండెంట్ యు.చక్రపాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సుందరయ్య

'విద్యా బోధన కుంటుపడింది'

ప్రజాశక్తి - గంపలగూడెం : మండల వ్యాప్తంగా విద్యాబోధన కుంటుపడిందని ఎన్టీఆర్ జిల్లా యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి అలవాల సుందరయ్య పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో మండల యుటిఎఫ్ కార్యవర్గ సమావేశం గౌర్రాజు కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. సుందరయ్య మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం జూన్‌లో 19 మంది (ఎంటిఎస్) మినిమం టైం స్కేల్ టీచర్స్ మండలానికి వచ్చినట్లు తెలిపారు. దూర ప్రాంతం కావడం, ఇతరత్రా సమస్యలతో ఇబ్బందులు పడుతున్న 11 మంది ఎంటిఎస్ ఉపాధ్యాయులు తిరిగి ఆయా ప్రాంతాలకు వెళ్లినట్లు తెలిపారు. అప్పటికి మండలంలో ఉపాధ్యాయులే లేని పాఠశాలలు 2, ఒకే ఉపాధ్యాయునీతో కొనసాగుతున్నవి 19 ఉన్నట్లు వివరించారు. పని సర్దుబాటులో భాగంగా జరిగిన డిప్యుటేషన్లు పారదర్శకంగా లేకపోవడం మరొక కారణమని వివరించారు. మొత్తంగా మండలంలో ఉపాధ్యాయుల కొరతతో విద్యా వ్యవస్థ దెబ్బతిన్నట్లు సుందరయ్య ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షురాలు డి.అపర్ణ, ప్రధాన కార్యదర్శి పి.ఏడుకొండలు, సభ్యులు సిహెచ్.రమేష్, కోట రాధాకష్ణ, వేముల రమేష్, పోతురాజు కృష్ణయ్య పాల్గొన్నారు.

వార్షిక తనిఖీలో డివైఇఒ సంతృప్తి

ప్రజాశక్తి - గంపలగూడెం: మండలంలోని ఊటుకూరు, నెమలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాధారణ తనిఖీ జరిగింది. నందిగామ డివైఈవో ఎం.వెంకటప్పయ్య పలు అంశాలను పరిశీలించి సూచనలు చేశారు. వివిధ తరగతుల విద్యా బోధన, హాజరు పట్టీల పరిశీలన, మధ్యాహ్న భోజన విధానం, నాడు-నేడు పనులు, విద్యార్థుల సామర్థ్యత, పాఠశాలల వాతావరణ పరిస్థితులను సంపూర్తిగా పరిశీలించి సంతప్తి చెందారు. ఆయా కార్యక్రమాల్లో ప్రధాన ఉపాధ్యాయులు టి.ఉమా మంజులాదేవి, డి.చంద్రం, సిబ్బంది, ప్యానల్ టీం ఉపాధ్యాయులు, సిఆర్‌పి సుమన్ పాల్గొన్నారు.

కర్నాటి బాబూరావుకు పలువురు నివాళి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం చైర్మన్ కర్నాటి రాంబాబు తండ్రి కర్నాటి బాబూరావు ఇటీవల మృతిచెందిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో శనివారం బాబురావు దశ దిన కర్మ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రంలో పశ్చిమ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొని కర్నాటి బాబురావు చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, రాయన నరేంద్ర, శాసన మండలి సభ్యులు వీణ, రుహుల్లా, విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ అసిఫ్, 39వ డివిజన్ కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవ, జలసూత్రం శ్రీనివాస్, గంటిగంపు వెంకట్, క్వాలిటీ ఖాదర్, కర్నాటి చంటి, బడేమియా, నజీమా, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

బాబురావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వెలంపల్లి, తదితరులు

ఊర్మిళా నగర్‌లో ఆలయం ప్రారంభం

ప్రజాశక్తి - భవానీపురం : పశ్చిమ నియోజకవర్గంలోని 43వ డివిజన్ ఊర్మిళానగర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ మాతా గోవిందమాంబ సమేత శ్రీ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి దేవాలయాన్ని పశ్చిమ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి పాల్గొని శనివారం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ సర్వ శ్రేయోనిధుల నుంచి రూ.14 లక్షల 95 వేలతో చేపట్టిన అభివృద్ధి పనులను పశ్చిమ శాసన సభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, స్థానిక డివిజన్ కార్పొరేటర్ బాపతి కోటి రెడ్డి, నత్య అకాడమీ డైరెక్టర్ భట్టిపాటి సంధ్యారాణి, భట్టిపాటి శివ, దేవాలయ నిర్వాహకులు కంది శ్రీనివాసరెడ్డి, కంది శివన్నారాయణ రెడ్డి, కంది శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్, తదితరులు

కార్తీక వన సమారాధనకు నిరాకరణ

- పోలీసుల తీరుపై మండిపడ్డ ఆర్యవైశ్యులు - సంఘీభావం తెలిపిన పలు పార్టీల నాయకులు

ప్రజాశక్తి - భవానీపురం : ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ, శ్రీవాసవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో భవానీపురం పున్నమిఘాట్ వద్ద వున్న మాజీ ఎమ్మెల్యే బొండా ఉమాకు సంబంధించిన స్థలంలో ఈనెల 26న నిర్వహించనున్న కార్తీక వన సమారాధనకు పోలీసులు అనుమతి నిరాకరించడం సరికాదని ఆర్యవైశ్యులు, వివిధ పక్షాల రాజకీయ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం పున్నమిఘాట్‌వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పలు రాజకీయ పక్షాలకు చెందిన నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వాసవి ఫౌండేషన్ అధ్యక్షులు వి.వి.కె.నరసింహారావు, రాష్ట్ర ఆర్యవైశ్య సాధన సమితి అధ్యక్షులు కొణిజేటి. రమేష్, డూండీ రాకేష్‌లు మాట్లాడుతూ తాము 20 రోజుల క్రితమే పున్నమి ఘాట్ వద్ద గల మాజీ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావుకు చెందిన స్థలంలో నిర్వహించేందుకు పోలీసులను అనుమతి కోరుతూ దరఖాస్తు చేసినట్లు తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, రాష్ట్ర నాయకులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు సంప్రదాయంగా ప్రతియేటా జరుపుకునే కార్తీక వన సమారాధనను అడ్డుకొనడం నీచమైన చర్యని, ప్రజాస్వామ్యంలో ఇటువంటి చర్యలకు పాల్పడడం దారుణమన్నారు. పోలీసులు వీరికి అనుమతులు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. జనసేన నగర అధ్యక్షులు పోతిని వెంకట మహేష్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించి పెట్టిన పొట్టి శ్రీరాములు వారసులు అయినటువంటి ఆర్యవైశ్యులు చేపట్టిన కార్తీక వనసమారాధనను అడ్డుకోవడం సభ్య సమాజం సిగ్గుపడే విధంగా ఉందని అన్నారు. సిపిఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, బిజెపి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్ మాట్లాడుతూ హిందువుల మనోభావాలను దెబ్బ తినే విధంగా ఎమ్మెల్యే వ్యవహరించే తీరు బాధాకరమని వ్యాఖ్యానించారు.

మాట్లాడుతున్న దోనేపూడి కాశీనాథ్, పున్నమిఘాట్ వద్ద ఆర్యవైశ్యులతో నాయకులు

క్రీడా దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : విజయవాడ రూరల్ మండలం నున్న కెనడీ హైస్కూల్‌లో వార్షిక క్రీడా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా ఆంధ్రప్రదేశ్ పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జిటివి రమణ, స్పోర్ట్స్ జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ గోపాలకృష్ణ హాజరయ్యారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు, క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించి అతిథులు జిటివి రమణ, గోపాల కృష్ణకు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం గెలుపొందిన జట్లకు, క్రీడాకారులకు అతిథులు ట్రోఫీలు, పతకాలు అందజేశారు. కెనడీ హైస్కూల్ చైర్మన్ సత్య రామకృష్ణ, డైరెక్టర్ సాయి తేజ కశ్యప్, ప్రిన్సిపాల్ రత్న కష్ణ, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ అప్పల రాజు పాల్గొన్నారు.

ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం

లింగ వివక్షను నిర్మూలించాలి

ప్రజాశక్తి - కంచికచర్ల : సమాజంలో అక్కడక్కడా కనిపిస్తున్న లింగ వివక్షను సమూలంగా నిర్మూలించాలని డిఆర్‌డిఎ డిపి ఎం.శోభన్ బాబు, డిపిఎం లైవ్‌లీ హుడ్స్ శోభారాణి, ఎపిఎం భాస్కరరావు పేర్కొన్నారు. లింగ వివక్ష నివారణ మాసోత్సవాలను శనివారం మహిళా సమాఖ్య కార్యాలయంలో నిర్వహించారు. మహిళల చేత ప్రతిజ్ఞ చేయించి అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లింగవివక్షతపై గ్రామాల్లో విసత్త ప్రచారం చేయాలని సూచించారు. మహిళలకు చట్టాలపై అవగాహన అవసరమన్నారు. గహహింస, వరకట్న వేధింపులు, బాలికల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కంచర్ల పద్మావతి, చేయుత మహిళా మార్ట్ అధ్యక్షురాలు ముత్యాల రోజా రమణి సెక్రెటరీ పుల్లమ్మ, సిసిలు యశోద నరసింహారావు రమణ, స్రవంతి, ఎఫ్‌పిఒసిసి అంజని పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేయిస్తున్న భాస్కరరావు, శోభారాణి

డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

పొట్టి శ్రీరాములు ఇంజినీరింగ్ కాలేజీలో ఫ్రెషర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : వన్‌టౌన్ కొత్తపేటలో గల పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జున రావు కాలేజీ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్)లో శనివారం ఫ్రెషర్స్ డే' సెలబ్రేషన్స్ ఘనంగా జరిగాయి. నూతనంగా బి.టెక్, యం.సి.ఏ, యం.టెక్లో చేరిన విద్యార్థులకు, ద్వితీయ సంవత్సరం చదువుచున్న విద్యార్థులు సాధరంగా స్వాగతం పలుకుతూ "ఫ్రెషర్స్ డే"ని ఎంతో ఘనంగా నిర్వహించారు. మొదటగా విద్యార్థులు గణేష్ వందన నత్యంతో ఫ్రెషర్స్ డేని ఎంతో అట్టహాసంగా ప్రారంభించారు. ఫ్రెషర్స్ డే సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు సంప్రదాయ, మోడ్రన్ దుస్తుల్లో హాజరయ్యారు. మిస్ - మిస్టర్ ఫ్రెషర్ పోటీలలో గెలుపొందినవారికి ముఖ్య అతిధిగా పాల్గొన్న కళాశాల సెక్రటరి కె. లక్ష్మణ స్వామి బహు మతులను అందచేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె. లక్ష్మీనారయణ మాట్లాడారు. ఈ కార్యక్ర మంలో కళాశాల కోశాధికారి కొత్తమాసు వెంకటశ్వేరావు, కమీటి సభ్యులు హరగోపాల్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. పంతజలి శాస్త్రి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామి నేషన్స్ డాక్టర్ యస్, మణికంఠ, పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న సిఐ హరీష్

విద్యార్థులకు నాసా ప్రాజెక్టు కిట్ల బహూకరణ

ప్రజాశక్తి - నందిగామ : శ్రీ చైతన్య నందిగామ శాఖలో నేషనల్ ఏరోనాటిక్స్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే నాసా ప్రాజెక్ట్ కిట్స్ బహుమతి ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపల్ గుప్తా ప్రదీప్ మాట్లాడారు. నందిగామ పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ హనీష్, సబ్ ఇన్‌స్పెక్టర్ పండుదొర మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలో ఒక శాస్త్రవేత్త దాగి ఉన్నాడని ఆ జ్ఞానాన్ని వెలికి తీసేవే ఇటువంటి ప్రాజెక్టులు అన్నారు. ఈ కార్యక్రమంలో సి బ్యాచ్ ఇన్‌ఛార్జ్ రామాంజనేయులు, నాసా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ రాజేష్, డిన్ రవికుమార్, వైస్ ప్రిన్సిపల్ వరుణ్ పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ పట్టణంలో 3వ వార్డు నందు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ ఎస్ జయరాం శనివారం పర్యటించారు. ప్రధాన రక్షిత మంచినీటి కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. రక్షిత మంచినీటి కేంద్రం వద్ద క్లోరిన్ టెస్ట్ చేయించారు. మంచినీరు రాని ప్రాంతాలలో ట్యాంకర్ ద్వారా మంచినీటిని సరఫరా చేయాలని తెలిపారు. అనంతరం గురుకుల హాస్టల్ పరిశీలించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. హానికరమైన దోమల సంతాన ఉత్పత్తిని అడ్డుకునేలా డ్రెయిన్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా వార్డులో జరుగుతున్న డే ఫాగింగ్‌ను కాల్వల్లో దోమల మందు పిచికారి చేయించారు.

ప్రజాశక్తి
జిల్లా వార్తలు 5
ఆదివారం 26 నవంబర్ 2023

సౌదారాణి కుటుంబాన్ని ఆదుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి-ఉయ్యూరు : విధి నిర్వహణలో గుండెపోటుతో మతి చెందిన అంగన్వాడీ కార్యకర్త ముళ్ళపూడి సౌదా రాణి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు చౌటుపల్లి రవి అన్నారు. శనివారం ఉయ్యూరు శ్రామిక భవనంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబమైన సౌధా రాణి కుటుంబానికి 10 లక్షలు ఎక్స్గ్రేషియా ప్రకటించాలని, పక్కా గహము కుటుంబంలో చదువుకున్న ఒకరికి ప్రభుత్వ ఉద్యోగము కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు కే .శివ నాగేంద్రం మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలకు సమాన పనికి సమాన వేతనం కల్పించాలని రిటైర్మెంట్ బెనిఫిట్స్ ప్రభుత్వం అందించాలని ఆయన కోరారు. ఈ సమావేశానికి సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బి రాజేష్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ప్రకాశ్, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు స్వర్ణలత, ఆశ వర్కర్స్ జిల్లా నాయకురాలు జి కుమారి, రైతు సంఘం మండల నాయకులు అన్నే సుబ్బారావు , సిఐటియు కంకిపాడు మండల కార్యదర్శి టి నరేష్ సిఐటియు ఉయ్యూరు మండల అధ్యక్షులు ఎస్ కే ఇస్మాయిల్, పెనమలూరు మండల కార్యదర్శి యు

మాట్లాడుతున్న చౌటపల్లి రవి

త్రిమూర్తులు, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకులు ఉయ్యూరు నాయకులు విజయలక్ష్మి, స్వర్ణ కుమారి దుర్గ ఉమామహేశ్వరి, పద్మ, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

సూచనలిస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

ధాన్యం కొనుగోలు సక్రమంగా నిర్వహించాలి

ప్రజాశక్తి-చల్లపల్లి : రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు సమర్ధవంతంగా నిర్వహించాలని చల్లపల్లి తహసిల్దార్ కే.గోపాలకృష్ణ సూచించారు. శనివారం చల్లపల్లిలోని పిఎసిఎస్ ఆవరణలో ఉన్న రైతు భరోసా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కోసం ఆర్బికేలో ఏర్పాట్లను పరిశీలించారు. తేమశాతం పరీక్షించే పరికరాలు పరిశీలించారు. ఆర్.బి.కే పీపీసీ సిబ్బందికి తగిన ఆదేశాలు సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో ఏవో జీ.సాయి సింధు, పిఎసిఎస్ చైర్మన్ పాగోలు నాగ సీతారామారావు (ఫణి), పిఎసిఎస్ సీఈవో తోట కష్ణారావు పాల్గొన్నారు.

లక్ష రూపాయల వితరణ

ప్రజాశక్తి-ఉంగుటూరు : మండలంలోని నాగవరప్పాడు గ్రామంలో నిర్మాణంలో ఉన్న రామాలయ సింహద్వారం ఏర్పాటుకు ఆలయ కమిటీ వారు తెలుగుదేశం పార్టీ గన్నవరం ఇంచార్జ్ యార్లగడ్డ వెంకట్రావును సంప్రదించగా వెంకట్రావు తన సొంత నిధుల నుండి లక్ష రూపాయలు వితరణగా ఆలయ కమిటీకి అందించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు ఆరుమళ్ళ కష్ణారెడ్డి, సర్నాల బాలాజీ, కొట్నాని మోహన్ రావు, ఆలయ కమిటీ సభ్యులైన పయ్యావుల ఆంజనేయులు, రాంబాబు, జొన్న రవి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

యాత్రికులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు : తహశీల్దార్

ప్రజాశక్తి-కోడూరు : ఈనెల 27న కార్తీక పౌర్ణమి సందర్భంగా హంసలదీవి సముద్రతీరం వద్దకు పుణ్యస్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తులకు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేస్తున్నట్లు కోడూరు మండల తాసిల్దార్ ఎస్ కే లతీఫ్ పాషా తెలిపారు. శనివారం కోడూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం కోడూరు పాలకాయతిప్ప బీచ్ వరకు ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసు వారు చర్యలు తీసుకోవాలన్నారు. హంసలదీవి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ రుక్మిణి సత్య భామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి వారి ఆలయం వద్ద సముద్ర తీరం మంచినీటి వసతి , సముద్ర తీరం వద్ద మహిళలు దుస్తులు మార్చుకు నేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నా మన్నారు. భక్తులకు సౌకర్యార్థం మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి

మాట్లాడుతున్న తహసీల్దార్ ఎస్ కే లతీఫ్ పాషా

104, 108 వాహనాలను అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. భక్తుల సౌకర్యాల విషయంలో మత్స్య, మెరైన్, రెవెన్యూ, పోలీస్, అటవీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సమన్వ యంతో పనిచేయాలని కోరారు.

పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టాక అనేక అభివద్ధి కార్యక్రమాలను నిర్వహించామని ఎంపీ బాలశౌరి అన్నారు. మండలంలోని అంగలూరు, చంద్రాల గ్రామాల్లో పలు అభివద్ధి కార్యక్రమాలను శనివారం ప్రారంభించారు . చంద్రాల గ్రామం నందు రూ.10.50 లక్షల జిల్లా పరిషత్ నిధులతో ఆర్డబ్ల్యూఎస్ ఏర్పాటు చేసిన మైక్రో వాటర్ ఫిల్టర్ ను, రూ 176-77 లక్షల అంచనాలతో జల్ జీవన్ పధకం పనులకు భూమి పూజ చేశారు. 20 లక్షల వ్యయంతో నిర్మించిన డాక్టర్ వై ఎస్ ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్ ప్రారంభించారు. అంగలూరులో పిఎసిఎస్ గోడౌన్ భవనం ప్రారం భోత్సవం చేశారు. ఈకార్యక్రమాలలో గుడివాడ శాసనసభ్యులు కొడాలి నాని మచిలీపట్టణం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి ,కష్ణా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఉప్పాల హారిక రాము , కె.డి.సి.సి బ్యాంక్ చైర్మన్ తాతినేని పద్మావతి ప్రారంభించగా కార్యక్రమంలో ఎంపీపీ కొడాలి సురేష్ సర్పంచ్ లు అర్జునరావు, రవికుమార్, నిమ్మగడ్డ కుటుంబ రావు, దుగ్గిరాల శేషుబాబు, ఎంపిడిఓ దారపు శ్రీనివాస్, తహసీల్దార్ అబ్దుల్ రహమాన్ మస్తాన్, ఏ ఇ ఆర్ డబ్ల్యు ఎస్ శివాజీ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎంపి, ఎంఎల్ఎ, జెడ్పి చైర్పర్సన్

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి-ఘంటసాల : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఘంటసాల మండల పరిషత్ అభివద్ధి అధికారిణి టి.అనూహ్య అన్నారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయ సమావేశ మందిరంలో విజయశ్రీ మండల మహిళా సమైఖ్య సభ్యులకు అంతర్జాతీయ స్త్రీ హింసా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండివో అనూహ్య మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి డిసెంబర్ 23 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాల వివాహాలు, లింగ వివక్షతపై సభ్యులు గ్రామాల్లో ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. దేశంలోనే గౌరవ ప్రదమైన రాష్ట్రపతి పదవీని మహిళలు అధిరోహించారని, మహిళలకు ప్రభుత్వాలు సముచిత స్థానాలు కల్పిస్తున్నాయని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన బాలికలకు మాత్రమే తల్లిదండ్రులు వివాహాలు చేయాలని తెలిపారు. చిన్న వయస్సులో వివాహాలు చేయటం వల్ల అనారోగ్య సమస్యలు అధికంగా ఉంటాయని తెలిపారు. సమాజంలో స్త్రీ, పురుషుల మధ్య బేధాలు లేవని, అందరూ సమానమనే భావనతో తల్లిదండ్రులు పిల్లలను పెంచాలని తెలిపారు. అనంతరం మండల మహిళా సమాఖ్య సభ్యులు, వివోఏలతో కలసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం బి.అమరేశ్వరరావు, సీసీలు మట్టా ఝాన్సీ, జి.నాగేశ్వరమ్మ, మండల సమాఖ్య పాలకవర్గ సభ్యులు, మండల సమాఖ్య సిబ్బంది, వివోఏలు పాల్గొన్నారు.**ప్రజాశక్తి-ఉంగుటూరు :** ఆడపిల్ల పుడితే ఇంటికి మహాలక్ష్మి వచ్చిందని సంబరపడే విదంగా వైయస్సార్ కళ్యాణమస్తు దోహదప డుతుందని ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు. శనివారం మండలం లోని స్త్రీ శక్తి భవనం నందు ఏపీఎం సాంబశివరావు అధ్యక్షతన స్వయం సహాయ సంఘాల సభ్యులతో జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీడీవో శేషగిరిరావు మాట్లాడుతూ ఆడబిడ్డ పుట్టిన దగ్గర నుండి వివాహమై అత్తవారింటికి వెళ్లే వరకు ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందన్నారు. 18 సంవత్సరాలు నిండిన తరువాత ఆడబిడ్డకు వివాహం చేయాలని, తద్వారా ఆడబిడ్డ ఆరోగ్యంగా తన బిడ్డలకు సంరక్షకురాలిగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డి అమీర్ భాష సీసీలు వివోలు స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-చల్లపల్లి :** బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ సాధిద్దామని వైఎస్ఆర్ క్రాంతి పథం ఏపీఎం బీ.అమలేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో శనివారం చల్లపల్లిలోని స్త్రీ శక్తి కార్యాలయంలో జెండర్ ఆధారిత వివక్ష నిర్మూలన సదస్సు జరిగింది. ఏపీఎం అమలేశ్వరరావు మాట్లాడుతూ యువతులకు 18 ఏళ్ళు, యువకులకు 21 ఏళ్ళు వచ్చిన తరువాతే వివాహం చేయాలని స్పష్టం చేశారు. విద్యార్థి దశలో వివాహాలు చేయకుండా ప్రతి ఒక్కరూ తమ బిడ్డలను ఉన్నత విద్యావంతులుగా చేయాలని సూచించారు. మహిళలు ఎదుర్కొంటున్న బాల్య వివాహాలు గహహింస సొసైటీలో ఎదురవుతున్న సమస్యలు వాటి నిర్మూలన పై ముఖ్యంగా మహిళా సంఘాలు బాధ్యత వహించాలని సమాజంలో అవగాహన కల్పించాలని ఎంపీడీఓ టి.అనూహ్య ప్రతిజ్ఞ చేయించారు. డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు

ఆదిలక్ష్మి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఆదిలక్ష్మి మృతికి సంతాపం

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : సిపిఎం పామర్రు మండల కార్యదర్శిఒడుగు గంగాధర్ ప్రసాద్ బార్య ఒడుగు ఆదిలక్ష్మి(52) శుక్రవారం సాయంత్రం హఠాన్మరణం పొందారు. రోజూలానే శుక్రవారం కూడా ఇంటివద్ద పనులు చేసుకుంటున్న ఆదిలక్ష్మి గుండెపోటుతో ఒక్కసారిగా కుప్పకూలి పోయి ప్రాణాలు విడిచారు. ఆమె మృతదేహాన్ని సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు ,జిల్లా కార్యదర్శి వై నరసింహరావు, జిల్లా కమిటీ సభ్యులు ఆర్ రఘు, సిఐటియు జిల్లా అధ్యక్షులు చౌటుపల్లి రవి, నాయకులు ఎం పోలి నాయుడు, బి సుబ్రహ్మణ్యం, బేతా శ్రీను, ఆర్ సి పి రెడ్డి , మూర్తి, మచిలీపట్నం ఐద్వా సంఘం నాయకులు కె. సుజాత ,సిహెచ్ విజయలక్ష్మి, సిహెచ్ బుల్లెమ్మ, పి లక్ష్మి ,ఎం పద్మ, టి చాందిని, ఎండి యూనస్ ,ఈడే రామారావు, సిహెచ్ జయరావు, ఎన్ ఎస్ నారాయణ, తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

చెక్పోస్ట్ ప్రారంభం

ప్రజాశక్తి-చల్లపల్లి : ఘంటసాల మార్కెట్ కమిటీ పరిధిలోని మోపిదేవి మండలం కాసానగరం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన చెక్ పోస్టును మార్కెట్ కమిటీ చైర్మన్ వేమూరి వెంకట్రావు శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మోత్కూరి ఏడుకొండలు, అబ్దుల్ హర్షద్, సోమేశ్వర గుప్త, ఏఎంసీ కార్యదర్శి బంగారు హేమ సుందర్ రావు, సూపర్వైజర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండల మహిళా సమాఖ్య నూతన పాలక వర్గం శనివారం మండల సమైక్య కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు ఏపీఎం నత్తా సాంబ మూర్తి తెలిపారు. సంఘ అధ్యక్షురాలిగా శాయన సత్య హారిక(విన్నకోట), ఉపాధ్యక్షురాలుగా అనగాని వెంకటలక్ష్మి (అంగలూరు), కార్యదర్శి గా కొల్లిపర లక్ష్మి (డోకిపర్రు), ఉప కార్యదర్శిగా కాటూరి జ్యోతి (మామిడి కోళ్ల), కోశాధికారిగా గాలంకి దుర్గాభవాని (గుడ్లవల్లేరు) ఎన్నుకోబడినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిసిలు వి లక్ష్మి, కె సుజాత, సిహెచ్ నాగరత్నం, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. నూతనంగా ఎన్నుకోబడిన వారికి అభినందనలు తెలిపారు.

ఉత్సాహంగా ఎన్టిటిఎఫ్ క్రీడా పోటీలు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో యన్టిటియఫ్ క్రీడా పోటీలు శనివారం ఉత్సాహంగా నిర్వ హించారు. ప్రిన్సిపాల్ మహీధర్ ఆధ్వర్యంలో పరిపాలనాదికారి పద్మజా కార్యక్రమం రూపొందించారు. పోటీలను గన్నవరం జడ్పిటిసి అన్నవరపు ఎలిజబెత్ రాణి పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోటీలు నిర్వహించినపుడే గ్రామీణ ప్రాంతం లోని నిజమైన క్రీడా ప్రగతి వెలుగు లోకి వస్తుందని తెలిపారు. గన్నవరం నియోజక వర్గ క్రీడా సమన్వయ కర్త ధనియాల నాగరాజు మాట్లాడుతూ పల్లెల్లో ఉన్న నైపుణ్యం గల సత్తా ఉన్న క్రీడాకారులను గుర్తించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం చేపట్టిందని యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా ఉపాధి కల్పనాధికారి దేవరపల్లి విక్టర్ బాబు, గుడ్ మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ చిప్పాడ చంద్ర శేఖరరావు, పాల్గొన్నారు. .100మీటర్లు, 200మీటర్లు,4 00మీటర్లు, 800మీటర్లు పరుగు పందెం నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

రన్నింగ్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

ఆర్‌యుబి పనులను పూర్తి చేయండి

విఎంసి కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - విజయవాడ : నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శనివారం మధురానగర్‌లో చేపట్టిన రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు. వీటిని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రూ.15 కోట్లతో నిర్మిస్తున్న ఆర్‌యుబి పనుల్లో దాదాపు రూ.6.5 కోట్లతో రిటైనింగ్ వాల్, కనెక్టింగ్ బ్రిడ్జి పనులు కొంత పూర్తయ్యాయని, ఇంకా రూ.8.5 కోట్లతో మిగిలినవి పూర్తి కావాల్సి ఉందన్నారు.

మొదటిపేజీ తరువాయి

నకిలీ మిర్చినారు బాధిత రైతులకు పెండింగ్ నష్టపరిహారం చెల్లించాలి

మాట్లాడుతూ పెనుగొలను గ్రామంలోని శ్రీ అభయాంజనేయ నర్సరీ, శ్రీ లక్ష్మి తిరుపతమ్మ నర్సరీల నుండి మిర్చినారును రైతులు, కౌలు రైతులు కొనుగోలు చేసి సాగు చేపట్టారని, అయితే పూత, పిందె రాకపోవడంతో ఆందోళన చెందిన రైతులు 2016 డిసెంబర్లోనే మండల వ్యవసాయ అధికారికి ఫిర్యాదు చేశారని గుర్తుచేశారు. అయితే అధికారులు నర్సరీల యజమానులకు అనుకూలంగా వ్యవహరించటంతో బాధితులు 2017 జనవరి నుండి నష్టపరిహారం కోసం ఉద్యమిస్తునే ఉన్నారని గుర్తుచేశారు. ఈ విషయపై జిల్లా స్థాయి అధికారులకు విన్నవించుకున్నారని, దీంతో వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు స్పందించి వ్యవసాయ శాస్త్రవేత్తలను పంపారని తెలిపారు. శాస్త్రవేత్తలు మిర్చి పంటలను పరిశీలించి నకిలీ మిర్చినారు కావడం వల్లనే పంట పండలేదని నిర్ధారించారని పేర్కొన్నారు. దీంతో నష్టపోయిన 87 మంది బాధిత రైతులు, కౌలు రైతులకు రెండు కోట్ల 13 లక్షల 29 వేల 70 రూపాయలు నష్టపరిహారంగా చెల్లించాలని నర్సరీ యజమానులకు జిల్లాస్థాయి నష్టపరిహార కమిటీ ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. కానీ నర్సరీల యజమానులు బేఖాతరు చేశారని తెలిపారు. దీంతో కమిటీ ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని కోరుతూ పెనుగొలను నుండి విజయవాడకు బాధిత రైతులు పాదయాత్ర చేపట్టారని తెలిపారు. అప్పటి కలెక్టర్, ఇతర అధికారులు రైతులతో చర్చలు జరిపి ఎకరానికి రూ.91 వేల వరకు నష్టపరిహారం ఇస్తామని, తక్షణమే ఎకరానికి రూ.35 వేలు చెల్లిస్తామని ఒప్పందం కుదుర్చుకుని రూ.30 వేలే ఇచ్చారని తెలిపారు. మిగిలిన డబ్బులను ఇప్పటికీ చెల్లించలేదన్నారు. ఎపి కౌలు రైతు సంఘం ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు గువ్వల సీతారామిరెడ్డి మాట్లాడుతూ జిల్లా స్థాయి నష్టపరహార కమిటీ సిఫారసు చేసిన విధంగా 87 మంది రైతులకు ఎకరానికి రూ.91 వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు ఇచ్చిన రూ.30 వేలు మిగిలిన మొత్తాన్ని చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మద్దిరెడ్డి వెంకటరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్, బాధిత రైతులు బి.పూర్ణ, పి.భద్రం, బి.గోపి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రవాణా

ఆదాయానికి గండిపడుతోంది.

మొక్కుబడి తినఖీలు....నామమాత్రపు పెనాల్టీలు

మైనింగ్ శాఖ వారు బండ రాళ్లను తరలిస్తున్న డంపర్లకు బిల్లులు ఉన్నాయో లేవో నిరంతరాయంగా తనిఖీలు చేయడం ద్వారా అక్రమాలను అరికట్టాల్సి ఉంది. అయితే మొక్కుబడిగానే ఈ ప్రక్రియ సాగుతోంది. అప్పుడప్పుడు బిల్లులు లేని ఒకటి అరా వాహనాలకు నామమాత్రంగా జరిమానాలు వేసి సరిపుచ్చుతున్నారు. 40 టన్నులకుపైగా బరువుతో వెళ్లే డంపర్ వాహనానికి రూ.20 నుంచి రూ.22 వేలు మాత్రమే పెనాల్టీగా వసూలు చేస్తున్నారు.

ఐదు నెలలుగా రవాణా

ఈ ఏడాది మే 22వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బందరు పోర్టు నిర్మాణ పనులను ప్రారంభించారు. నాలుగు బెర్తుల నిర్మాణ పనుల్లో భాగంగా పోర్టు నిర్మాణ ప్రాంతంలో సముద్రంలో డ్రెడ్జింగ్‌కు ముందే సౌత్, నార్త్ బ్రేక్ వాటర్ పనులు జరుగుతున్నాయి. 180 డంపర్లలో అప్పటి నుంచి పెద్దఎత్తున బండ రాళ్లు తరలిస్తున్నారు. క్వారీలో బిల్లులు, బ్రేక్ వాటర్‌కు ఉపయోగించిన రాళ్ళను నిపుణులు పరిశీలిస్తే అక్రమాలు ఏస్థాయిలో జరిగాయో తేటతెల్లం అవుతుంది. ఇకపై నుండైనా అక్రమాలు జరగకుండా ప్రతి డంపర్ బిల్లులను పరిశీలించి ప్రభుత్వ ఆధాయానికి గండి పడకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

'శ్రీ చైతన్య' బస్సులో మంటలు

కిందికి దించారు. ఇంజన్ వద్ద వైర్లు షార్ట్ సర్క్యూట్ కారణంగా పొగలు వచ్చినట్లు గమనించిన డ్రైవర్ బ్యాటరీ కనెక్షన్లు తొలగించాడు. స్థానికులు బకెట్లతో నీళ్లు తెచ్చి మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. విద్యార్థులు ప్రమాదం నుండి సురక్షితంగా బయటపడతంతో స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

అస్తవ్యస్తంగా రోడ్లు

మైలవరం డివిజన్ పరిధిలో 168.130 కిలో మీటరు పొడవున ఉన్నాయి.

200 కిలో మీటర్ల మేర నిర్మాణానికి నిర్ణయం

ముందుకు రాని గుత్తేదారులు

గత నాలుగున్నర ఏళ్లల్లో సగానికిపైగా రోడ్లు దెబ్బ తిన్నాయి. వీటిలో నాలుగో వంతు రోడ్ల పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. దాదాపు 200 కిలో మీటర్ల పొడవున ఈ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో దెబ్బతిన్న రోడ్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగా ఏడు రాష్ట్ర రహదారులకు, 18 మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్లను చేపట్టాలని భావించింది. వీటిలో 132.832 కిలో మీటర్ల మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్లు, 70.068 కిలో మీటర్ల వరకు రాష్ట్ర రహదారులు ఉన్నాయి. రూ.49.86 కోట్లతో ఎస్‌డిఆర్‌లు, రూ.25.70 కోట్లతో ఎండిఆర్‌లకు మరమ్మతులతోపాటు నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించింది. ఇందుకుగాను ఆరు నెలల క్రితమే టెండర్ల ప్రక్రియ కూడా అధికారులు పూర్తి చేశారు. అప్పుడే గుత్తేదారులకు వర్క్ అలాట్‌మెంట్ కూడా ఇచ్చారు. అందుకు అనుగుణంగా కాంట్రాక్టర్లు, ఆర్ అండ్‌బి శాఖ మధ్య ఒప్పందం జరగాల్సి ఉంది. కానీ గుత్తేదారులు అగ్రిమెంట్లు చేసుకునేందుకు ఆసక్తి చూపడంలేదు. జిల్లాలో రోడ్ల పనులు చేపట్టేందుకు అర్హత కలిగిన కాంట్రాక్టర్లు సుమారు 12 నుంచి 15 మంది వరకు ఉన్నారు.

నిధులు విడుదల చేయని ప్రభుత్వం

పనులు ప్రారంభించే ముందే ప్రభుత్వం 25 శాతం నిధులు విడుదల చేయాల్సి ఉంది. కానీ ప్రభుత్వం నుంచి ఇప్పటికీ నిధులు విడుదల కాకపోవడంతో గుత్తేదారులు పనులు చేసేందుకు వెనకడుగు వేస్తున్నారు. దీనికితోడు గతంలో చేసిన పనులకు సంబంధించిన బిల్లులు కూడా ఇంత వరకు చెల్లించలేదు. కోట్లాది రూపాయల చెల్లింపులు నిలచిపోయాయి. దీంతో గుత్తేదారులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. తమ సొంత డబ్బులు పెట్టి పనులు చేపడితే బిల్లులు ఎప్పటికి చెల్లిస్తారోనని ఆందోళన చెందుతున్నారు. ఈనేపథ్యంలో పనులు ఎప్పుడు ప్రారంభమై ఎప్పుడు పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. వెంటనే నిధులు విడుదల చేసి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మహాధర్నాను విజయవంతం చేయండి

కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి మాల్యాద్రి పిలుపు

ప్రజాశక్తి - విజయవాడ : కార్మిక, కర్షక ఐక్యవేదిక ఆధ్వర్యాన ఈనెల 27, 28 తేదీల్లో విజయవాడ జింఖానా గ్రౌండ్స్‌లో జరిగే మహాధర్నాకు దళిత, గిరిజన ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర కార్యదర్శి అంద్ర మాల్యాద్రి పిలుపునిచ్చారు. మహాధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ శనివారం కెవిపిఎస్ ఆధ్వర్యాన సింగ్‌నగర్లో ప్రచారం చేశారు. ఈకార్యక్రమంలో మాల్యాద్రితోపాటు నాయకులు సిహెచ్ శ్రీనివాస్, జి అరుణ, జి మహేష్, సురేష్ తదితరులు పాల్గొని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ రాజ్యాంగాన్ని, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకుందామని అన్నారు. దళిత, గిరిజన, కార్మిక, కర్షక , కౌలు రైతు, వ్యవసాయ కార్మికుల వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న కేంద్రంలోని మనువాద, మతోన్మాద బిజెపి ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో ఓడించాలని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు.

సింగ్‌నగర్లో ప్రచారం చేస్తున్న మాల్యాద్రి

పాస్ పోర్ట్ పోయినది

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా, కనిగిరి మండలం, రాళ్లపల్లి గ్రామం కు చెందిన మేడిబోయిన వెంకటేశ్వర్లు (తండ్రి) వెంకటయ్య పేరుతో గల పాస్‌పోర్ట్ పోయినది. 2016 సంవత్సరంలో హైదరాబాద్ పాస్‌పోర్ట్ కార్యాలయం వారు జారీ చేసిన పాస్‌పోర్ట్ నెంబర్ **P5892374** గల పాస్‌పోర్ట్ పొందినది. మేడిబోయిన వెంకటేశ్వర్లు విజయవాడ లోని భవానీపురంలో ఒక కంపెనీలో వర్క్‌చేసుకుంటూ భవానీపురంలోనే నివాసం ఉంటున్నాడు. ఈ నెల ది.10-11-2023 వ తేదీన పాస్‌పోర్ట్ జిరాక్స్ కోసం భవానీపురంలోని ఇంటి నుండి బైక్ పై వెళ్తుండగా బైక్ కవర్‌లో ఉంచిన పాస్ పోర్ట్ మార్గంమధ్యలో పోయినది. పై పేరుతో గల పాస్‌పోర్ట్ దొరికిన వారు 7288988008 కు సమాచారం అందించగలరు..

IN THE COURT OF THE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL (PRL. DISTRICT JUDGE) AT KOTHAGUDEM
I.A.No /2023 in MATOP No.84/2023

Between:
Banoth Venkataiah
...Petitioner/Claim Petitioner
And
Chettumala Manikya Rao and others
...Respondents/Respondents

NOTICE

To
1)Chettumala Manikya Rao,
S/o Devasahayam, age 26 years,
Driver of Lorry No.AP-16/TJ-2479,
R/o.Malleswaram of Chintalapudi Mandal,
Eluru District, **Respondent No.1**
2)Siva Koteswar Rao Garnepudi,
S/o.Jagan Mohan Rao, age adult, Occ: Owner of Lorry No.AP-16/TJ-2479, R/o H.No.11-44, Ramachandrapuram Village, Yekonduru Mandal, NTR District.
Respondent No.2

Please take the notice that the above case is posted for your appearance on 28-12-2023 at about 10-30 AM. As such, both of you should appear in person of through an advocate, if fails is appear before th Hon□ble Court the matter will be decided ex-parte.

By order of the Court

Date:21-11-2023
Kothagudem

Immadi Ravi,
Advocate for Petitioner,
Kothagudem.

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT VIJAYAWADA
O.S.No. 6/2020

Between:
Y. Venkateswara Reddy ..Petitioner/ Plaintiff
AND
Smt. Cheboyina Vani & 4 others
... Respondents / Defendants

Respondent:
Cheboyina Chandra Sekhar,
S/o. Late. Nancharaiah, Bharath Towers,
D.No. 27-1-96, Peddibhotlavari Street,
Governerpet, Vijayawada-520002.

పై నెంబరు దావాను Petitioner/ Plaintiff Y. Venkateswara Reddy, Cheboyina Chandra Sekhar పై దావాను దాఖలు చేసియున్నారు. సదరు దావాలో Respondents / Defendants కి సమన్లు నిమిత్తం శ్రీ కోర్టు వారు ది.04-12-2023నకు వాయిదా వేసియున్నారు. కావున ఆ రోజు ఉదయం గం.10.30 ని.లకు Respondents / Defendants గానీ వారి తరపున అడ్వకేట్ గారి ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఆక్షేపణలు ఉన్న తెలుపుకొనవలెను. లేనియెడల దావా మీ పై కోర్టు వారిచే పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా తేదీ: 04-12-2023

/// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు ///

మహ్మద్ ఆరీఫ్
విజయవాడ Petitioner/ Plaintiff తరపు న్యాయవాది
ది.25-11-2023 మాచవరం, విజయవాడ-520002

కోర్టు ప్రకటన

IN THE COURT OF THE HON'BLE. JUNIOR CIVIL JUDGE AT VUYYURU
O.S No: 11/2021

Between :-
UNION BANK OF INDIA, E- ANDHRA BANK (RECENTLY ANDHRA BANK MERGED WITH UNION BANK OF INDIA) KATURU BRANCH,VUYYURU MANDAL KRISHNA DISTRICT, Rep by its BRANCH MANAGER..........Plaintiff
AND
1). Gandrapu Vinod Kumar
2) Gandrapu Prasad ....Defendants

To,
M/s. Gandrapu Vinod Kumar S/o Prasad, aged about 49 years R/o H.No. 1-62, Kalavapamula (village) Vuyyuru Mandal , Krishna dt.
.......Ist.Defendant

పై నెంబరు దావాలో వాది తనకు రావాలసిన బాకీ మొత్తం ను రాబట్టు కొనుటకు ప్రతివాదులపై దావా దాఖలా చేసియున్నారు. సదరు దావాలో 1వ ప్రతివాది అయిన మీకు ఎన్నిసార్లు కోర్టు వారు నోటీసులు పంపిన తీసుకొనకుండా త్రిప్పిపంపిన కారణంగా మీ హాజరు నిమిత్తం శ్రీ కోర్టువారు ది.26-12-2023న వాయిదా వేసినారు. సదరు తేదిన ఉదయం గం॥ 10.30ని॥లకు మీరు పై కోర్టు వారి ఎదుట హాజరై తమకు గల ఆక్షేపణలు తెలుపుకొన వలెను.లేనియెడల మీ పరోక్షంగా తీర్మానం చేయగలరని తెలియజేయడమైనది.

(శ్రీకోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది: 26-12-2023
ఇట్లు:-హూరున్నీసా బేగం
వాది తరపు న్యాయవాది
విజయవాడ-1. ఫోన్ :9848471048

మహారాజశ్రీ 13 వ అదనపు జిల్లా జడ్జి, విజయవాడ వారి కోర్టు
ఐ ఏ నెం. 179/2023 ఇన్ ఓ.ఎస్ నెం.374/2017

బిట్వీన్:
మదనం బేడు విజయలక్ష్మి ...పిటీషనర్/వాది
మరియు
1. మదనం బేడు సుబ్బరాయచారి (డైడ్)
2. కోలవెన్ను గుణసుందరి
3. కోలవెన్ను హేమలత
4. మల్లాపురం విజయలక్ష్మి
proposed respondents/ defendents

NOTICE THROUGH PUBLICATION

టు:
R3: కోలవెన్ను హేమలత, భర్త: లేటు కోలవెన్ను సుబ్బారావు, డోర్ నెం. 21-11-63, రైల్వే సొసైటీ, మధురానగర్, విజయవాడ-520011

ఇందు పై నెంబరు పిటిషన్ నందు 3వ రెస్పోండెంట్ నోటీసు నిమిత్తం దినము 26-12-2023 వ తేదీ కి వాయిదా వేసియున్నారు కావున ఆ రోజు ఉదయం 10.30 ని లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గానీ, మీ లాయరు గారి ద్వారా గానీ హాజరు అయి మీ అభ్యంతరములు, ఆక్షేపణలు తెలియపరచవలెను లేని యెడల ఈ పిటీషను ను మీ పరోక్షముగా తీర్మానించబడును

(శ్రీ కోర్టు వారి ఉత్తరువులతో)
వాయిదా తేదీ: 26-12-2023

NVNK దుర్గా పద్మాంజలి,
పిటీషనరు తరపు నాయవాది,
నూజివీడు-521201, Cell: 9396826418

కోర్టు నోటీసు
మహారాజశ్రీ ఉయ్యూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఐ.ఎ.నెం:96/2020 ఇన్ ఓ.యస్.నెం:35/2020

బిట్వీన్:
ఈడే నాగమణి, భర్త: వెంకట ఉమామహేశ్వరరావు, హిందువు, వయస్సు:36సం॥లు, పరమేశ్వరరావు కాంప్లెక్స్, కాటూరు రోడ్డు, ఉయ్యూరు, కృష్ణాజిల్లా.
...పిటీషనరు/వాది
మరియు
1.రాజులపాటి జయలక్ష్మి, భర్త: (లేటు) సత్యనారాయణ, హిందువు, వయస్సు:55 సం॥, డోర్ నెం.2-91-1, గురజాడ గ్రామం, పమిడిముక్కల మండలం, కృష్ణాజిల్లా.
2.రాజులపాటి జగదీష్‌బాబు, తండ్రి: (లేటు) సత్యనారాయణ, హిందువు, వయస్సు:32 సం॥, డోర్ నెం.2-91-1, గురజాడ గ్రామం, పమిడిముక్కల మండలం, కృష్ణాజిల్లా.
3.కొండేటి శివమ్మ, భర్త:శ్రీరామమూర్తి, హిందువు, వయస్సు:65 సం॥లు, మంతెన గ్రామం, కంకిపాడు మండలం, కృష్ణాజిల్లా.
4.ఈడే నాగమల్లేశ్వరి, భర్త:రెడ్డయ్య, డోర్ నెం.2-45, హిందువు, వయస్సు:58సం॥లు, గురజాడ గ్రామం, పమిడిముక్కల మండలం, కృష్ణాజిల్లా.
5.బడుగు లక్ష్మి వెంకటేశ్వరమ్మ, భర్త:వెంకట సుబ్బారావు, హిందువు, వయస్సు:54సం॥లు, నేతాజీ రోడ్డు, మధురా నగర్, విజయవాడ, యన్.టి.ఆర్.జిల్లా. ...రెస్పాండెంట్స్/ప్రతివాదులు

ఇందు మూలముగా పై నెంబరు పిటీషన్‌లో రెస్పాండెంట్స్/ప్రతివాదులైన మీలో 1 నుండి 5 వారలకు తెలియజేయునది ఏమనగా, పై నెంబరు దావాలో రెస్పాండెంట్స్/ప్రతివాదులైన మీపై పిటీషనర్/వాది అయిన ఈడే నాగమణి గారు జాయింటు కుటుంబ ఆస్తులలో వాటాల విభాగములు కోరుచూ పై కోర్టువారి ఎదుట పై నెంబరు దావా దాఖలు చేయుచూ, సదరు దావా ఆస్తులను ఇతరులకు బదలాయించుట నిషేదించమని కోరుచూ సదరు ఐ.ఎ.ను ఫైల్ చేసి యున్నారు. శ్రీ కోర్టు వారి నుండి మీ హాజరు నిమిత్తం ఎన్ని పర్యాయములు సమన్లు పంపినప్పటికీ అవి మీరు అందుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని, ఐ.ఎ.నెం.547/2023 ద్వారా శ్రీ కోర్టు వారు ఆర్డరు వేసి యున్నారు. కావున మీరు సదరు పిటీషను/దావా వాయిదా తేది ది.26-12-2023న ఉండి యున్ననందున, మీరు స్వయంగా గానీ, ప్లీడరు గారి ద్వారా గానీ ది.26-12-2023వ తేదీన శ్రీ కోర్టువారు ఎదుట హాజరు అయి మీ ఆక్షేపణలను తెలియజేయగలరు. లేని యెడల మీ పరోక్షమున సదరు పిటీషను తీర్మానము జరుగునని మీకు తెలియ జేయడమైనది.

శ్రీ కోర్టువారు ఉత్తర్వుల ప్రకారం
ఆర్డరు తేది:17-08-2023
ఆర్డరు పొడిగింపు తేదీ:20-10-2023
వాయిదా తేది:26-12-2023

ఇట్లు
మోర్ల అంకా శ్రీనివాసరావు,
పిటీషనరు తరపు న్యాయవాది,
ప్లాట్ నెం.301, లక్ష్మీ రెసిడెన్సీ,
గ్రేస్ హాస్పటల్ దగ్గర, ఉయ్యూరు,
సెల్.నెం.9347717041.

కోర్టు నోటీసు
మహారాజశ్రీ ఉయ్యూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.యస్.నెం:35/2020

బిట్వీన్:
ఈడే నాగమణి, భర్త:వెంకట ఉమామహేశ్వరరావు, హిందువు, వయస్సు:36సం॥లు, పరమేశ్వరరావు కాంప్లెక్స్, కాటూరు రోడ్డు, ఉయ్యూరు, కృష్ణాజిల్లా.
...వాది
మరియు
1.రాజులపాటి జయలక్ష్మి, భర్త: (లేటు) సత్యనారాయణ, హిందువు, వయస్సు:55 సం॥, డోర్ నెం.2-91-1, గురజాడ గ్రామం, పమిడిముక్కల మండలం, కృష్ణాజిల్లా.
2.రాజులపాటి జగదీష్‌బాబు, తండ్రి: (లేటు) సత్యనారాయణ, హిందువు, వయస్సు:32 సం॥, డోర్ నెం.2-91-1, గురజాడ గ్రామం, పమిడిముక్కల మండలం, కృష్ణాజిల్లా.
3.కొండేటి శివమ్మ, భర్త:శ్రీరామమూర్తి, హిందువు, వయస్సు:65 సం॥లు, మంతెన గ్రామం, కంకిపాడు మండలం, కృష్ణాజిల్లా.
4.ఈడే నాగమల్లేశ్వరి, భర్త:రెడ్డయ్య, డోర్ నెం.2-45, హిందువు, వయస్సు:58సం॥లు, గురజాడ గ్రామం, పమిడిముక్కల మండలం, కృష్ణాజిల్లా.
5.బడుగు లక్ష్మి వెంకటేశ్వరమ్మ, భర్త:వెంకట సుబ్బారావు, హిందువు, వయస్సు:54సం॥లు, నేతాజీ రోడ్డు, మధురా నగర్, విజయవాడ, యన్.టి.ఆర్.జిల్లా. ...ప్రతివాదులు

ఇందు మూలముగా పై నెంబరు దావాలో ప్రతివాదులైన మీలో 1 నుండి 5 వారలకు తెలియజేయునది ఏమనగా, పై నెంబరు దావాలో ప్రతివాదులైన మీపై వాది అయిన ఈడే నాగమణి గారు జాయింటు కుటుంబ ఆస్తులలో వాటాల విభాగములు కోరుచూ పై కోర్టువారి ఎదుట పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. శ్రీ కోర్టు వారి నుండి మీ హాజరు నిమిత్తం ఎన్ని పర్యాయములు సమన్లు పంపినప్పటికీ అవి మీరు అందుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని, ఐ.ఎ.నెం.546/2023 ద్వారా శ్రీ కోర్టు వారు ఆర్డరు వేసి యున్నారు. కావున మీరు సదరు దావా వాయిదా తేది ది. 26-12-2023న ఉండి యున్ననందున, మీరు స్వయంగా గానీ, ప్లీడరు గారి ద్వారా గానీ ది.26-12-2023వ తేదీన శ్రీ కోర్టువారు ఎదుట హాజరు అయి మీ ఆక్షేపణలను తెలియజేయగలరు. లేని యెడల మీ పరోక్షమున సదరు దావా తీర్మానము జరుగునని మీకు తెలియ జేయడమైనది.

శ్రీ కోర్టువారు ఉత్తర్వుల ప్రకారం
ఆర్డరు తేది:17-08-2023
ఆర్డరు పొడిగింపు తేదీ:20-10-2023
వాయిదా తేది:26-12-2023

ఇట్లు
మోర్ల అంకా శ్రీనివాసరావు,
పిటీషనరు తరపు న్యాయవాది,
ప్లాట్ నెం.301, లక్ష్మీ రెసిడెన్సీ,
గ్రేస్ హాస్పటల్ దగ్గర, ఉయ్యూరు,
సెల్.నెం.9347717041.

లంక భూములకు లీజు పట్టాలు పంపిణీ

తోట్లవల్లూరులో పట్టాలు అందజేస్తున్న కలెక్టర్, ఎంఎల్ఎలు

ప్రజాశక్తి- తోట్లవల్లూరు : భూ సమస్యల పరిష్కారం కోసం లంక భూములకు లీజు పట్టాల పంపిణీ కార్యక్రమం శనివారం తోట్లవల్లూరు జిల్లా పరిషత్ హై స్కూల్ ఆట స్థలంలో నిర్వహించడం జరిగింది. ఈ లీజు పట్టాలా పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ పి రాజబాబు, పామరు నియోజకవర్గ శాసన సభ్యులు కైలే అనిల్ కుమార్, పెనమలూరు నియోజకవర్గం శాసనసభ్యులు కోలుసు పార్థసారథి విచ్చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేసింది అని ఇందులో భాగంగా లంకల్లో సొసైటీ భూములు సాగు చేసుకునే లబ్ధిదారులకు లీజు పట్టాలు పంపిణీ కార్యక్రమం చేపట్టిందని ఈ పట్టాలు పొందిన రైతులు సద్వినియోగం చేసుకున్న అభివద్ధిలోకి రావాలని వారు కోరారు. కష్ణా నది తీరం వెంబడి ఉన్న దేవరపల్లి, నార్త్ వల్లూరు, సౌత్ వల్లూరు,చాగంటిపాడు,రొయ్యూరు గ్రామాలలోని 2891 మంది రైతులు 1420 ఎకరాలలో సొసైటీ భూములు సాగు చేస్తున్నారు. వీరికి ఐదు సంవత్సరాల లంక లీజ్ ల్యాండ్ పట్టాలు అందించడం జరిగిందని తెలిపారు. రైతు భరోసా, సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, బ్యాంకులలో రుణాలు మంజూరు, పంటల బీమా లాంటివి పొందడానికి రైతుకు ఈ పట్టాలు ఉపయోగపడతాయని తెలిపారు. సర్పంచి పెనుమత్స రాధిక,ఎంపీపీ ఈడుపుగంటి రాజమణి, జడ్పిటిసి జొన్నల రామ్మోహన్ రెడ్డి, ఉయ్యూరు ఆర్డిఓ డి. రాజు, తాసిల్దార్ కుసుమకుమారి, ఎంపీడీవో స్వర్ణలత, నడకుదురు రాజేంద్ర, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. **ప్రజాశక్తి మోపిదేవి :** మోపిదేవి,అవనిగడ్డ మండలాలకు సంబందించిన లంక భూముల లీజు పట్టాలను అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి,ఉమ్మడి కష్ణా గుంటూరు జిల్లాల రైతు విభాగం జోనల్ ఇంఛార్జి కడవకొల్లు నరసింహారావు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు మాట్లాడుతూ చంద్రబాబు లంక భూములకు రివర్ బెల్ట్ అని పేరు పెట్టి పట్టాలు, పథకాలు లేకుండా చేస్తే జగన్మోహనరెడ్డి ఇప్పుడు లంక రైతులకు లీజు పట్టాలు రెన్యూవల్ చేసి పథకాలు అందుకనే అవకాశం కల్పిస్తున్నారు. అనంతరం మోపిదేవి మండలంలో 272 ఎకరాలను 1009 మంది లబ్ది దారులకు,అవనిగడ్డ మండలంలో 189 ఎకరాలను 132 మందికి పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

శాశ్వత రక్తదాతల కేంద్రం ఏర్పాటు అభినందనీయం : డిఎస్‌పి

ప్రజాశక్తి - గుడివాడ : వికేఆర్, విఎన్‌బి ఇంజనీరింగ్ కళాశాలలో శాశ్వత రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని డిఎస్పి పి శ్రీకాంత్ అన్నారు. శనివారం వికేఆర్, వి ఎన్ బి ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా కరస్పాండెంట్, సెక్రటరీ వేములపల్లి కోదండరామయ్య ఆధ్వర్యంలో శాశ్వత రక్తదాతల నిధి కేంద్రాన్ని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఇందిరాదేవితో కలిసి డిఎస్పీ శ్రీకాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యం ప్రతి వ్యక్తి ప్రధాన అవసరమన్నారు. కళాశాలలో ఈ కేంద్రం ఏర్పాటు అభినందనీ యమన్నారు.కళాశాల డైరెక్టర్ బి కళ్యాణ్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ హెచ్ వి ప్రసాద్ రావు, కళాశాల విభాగాధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'పై వాలంటీర్లకు శిక్షణ

ప్రజాశక్తి - విజయవాడ : 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంపై విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాలు మేరకు విఎంసి అధికారులు, జిల్లా స్టెప్, క్రీడా శాఖల అధికారులు కలిసి వార్డు వాలంటీర్లకు నగరంలోని ఐవి ప్యాలెస్‌లో మూడు నియోజకవర్గాలకు చెందిన సుమారు 2800 మందికి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విఎంసి అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) కెవి.సత్యవతి, జిల్లా స్పోర్ట్స్ సీఈవో యు.శ్రీనివాసరావు, చీఫ్ కోచ్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకలి కేకలు.. పింఛను కోసం పాట్లు..

ప్రజాశక్తి, గుడివాడ రూరల్ : ఓ వైపు ఆనారోగ్యం.. మరో వైపు ఆకలి కేకలు..ఏమి చెయ్యాలో దిక్కు తోచని స్థితి. కట్టుకున్న వాడు చెడు వ్యసనాలకు బాని సై ఐదు ఏళ్ల క్రితమే మృత్యు ఒడికి చేరుకున్నాడు. కడుపున పుట్టిన ఇద్దరు కుమార్తెలలో హెస్సిబా మూడు ఏళ్ల క్రితమే మృత్యు ఒడికి చేరుకుంది. మరో కుమార్తె కుసుమను చదువు మన్పించి వేసి బిక్షాటన చేసుకుంటూ పొట్ట పోసుకుంటున్న వైనం. గుడివాడ మండలం మల్లాయపాలెం పంచాయతీ శ్రీకాళహస్తీ కాలనీలో నివాసం ఉంటున్న ఉయ్యూరు సుజాత దిన గాథ పలువురుని కలిచివేస్తోంది. భర్త మృతి చెందిన తరువాత తల్లి నాంచారమ్మ పంచన తల దాచుకుంటూ జీవనం సాగిస్తోంది. క్షయ వ్యాధి ఇబ్బంది పెడుతున్నా కుమార్తె కోసం బతుకుతూ పింఛను కోసం తిరగని చోటు లేకుండా తిరుగుతోంది. భర్త ఎక్కడ చనిపోయాడో కూడా తెలియక ధృవీకరణ పత్రం లేక ఇబ్బంది పడుతోంది. ఈ విషయమై మచిలీపట్నం కలెక్టరేట్‌లో కూడా ఫిర్యాదు

సమస్య తెలుసుకుంటున్న ఐద్వా నాయకురాలు రజని

చేసింది. గురువారం మల్లాయపాలెం పంచాయతీలో అధికారులను కలసి న్యాయం చెయ్యాలని వేడుకోవడంతో వారు మరణ ధృవపత్రం లేకపోతే తాము ఏమి చెయ్యాలేమని ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. గుడివాడ ఐద్వా కార్యదర్శి పి.రజని ఆమెను పరిమర్శించి వివరాలు అడిగి తెలుసుకుని తమ సంఘం ద్వారా సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి నిరుపేద మహిళకు పింఛను మంజూరు చేసి ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

పాఠశాలలో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వల్ప అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఫైర్ సిబ్బంది పి ఎస్ వి వి ప్రసాద్ నేతతంలో సకాలంలో స్పందించడంతో తటిలో పెనుముప్పు తప్పింది. శనివారం కిచెన్ వద్ద విద్యుత్ మీటర్ మెయిన్ ఫీజుల వద్ద ఉదయం మంటలు చెల్లరేకగా అప్పటికే మిడ్ డే మీల్ పనులు ప్రారంభం కావడంతో అప్రమత్తమైన పాఠశాల సిబ్బంది ఫైర్ స్టేషన్ కు ఫోన్ చేయగా హుటాహుటిన ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు.మంటలు చెలరేగడానికి ఓవర్ లోడ్ కారణమా లేక పవర్ ప్ల ఫ్లక్చ్ వేషన్ కారణమా అన్నది తేలాల్సి ఉందని ఫైర్ ఆఫీసర్ తెలిపారు.

వసతి గృహాల పరిశీలన

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన జిల్లా ఖజానా అధికారి ఎస్ రవికుమార్ శనివారం సాయంత్రం అవనిగడ్డ లోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర బాలికల వసతి గహాలను సందర్శిం చారు. ఈ సందర్భంగా హాజరు పట్టీలను పరిశీ లించి విద్యార్థులకు అందిస్తున్న మెనూను పరిశీ లించి సంతప్తి వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో తులత ఎస్ టి ఓ కార్యాలయాన్ని సందర్శించగా కార్యాలయంలో రికార్డులను ఎస్ టిఓ ఆదిశేషు రికార్డులు చూపించగా వాటిని పరిశీలించి సంతప్తి వ్యక్తం చేశారు. కార్యాలయం సిబ్బంది ఆనందకుమార్, సాయిరాం పాల్గొన్నారు.

విద్యార్థులకు రాజ్యాంగ పఠనం అవసరం

- కెయు ఉపకులపతి ఆచార్య జ్ఞానమణి

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించాలంటే భారత రాజ్యాంగాన్ని ఖచ్చితంగా చదవాలని కష్ణా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య జి జ్ఞానమణి పేర్కొన్నారు. సంవిధాన దివస్ పురస్కరించుకొని విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే ఎక్కువ కాలం రచించబడిన రాజ్యాంగం భారత రాజ్యాంగం అన్నారు. ఎన్ ఎస్ ఎస్ సమన్వయకర్త డా శ్రావణి అధ్యక్షతన జరిగిన సభలో రిజిస్ట్రార్ డా వీరబ్రహ్మాచారి విశ్వవిద్యాలయ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వై కె సుందరకష్ణ, ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయకుమారి, ఫార్మసీ కళాశాల విభాగాధిపతి ఆచార్య మారుతి తదితరులు ప్రసంగించారు. తొలుత బాబాసాహెబ్ డా బి ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి ఉపకులపతి ఆచార్య జి జ్ఞానమణి పూలమాలలు వేసి

నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డా స్వరూపరాణి, డా శాంతికప, డా కవిత, డా సుజయ్, డా శేషరెడ్డి, డా రాణి, పిడి గోపి తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) :** ప్రపంచ దేశాల్లో అన్ని రాజ్యాంగాలకన్నా భారత దేశ రాజ్యాంగంకి ఎంతో గుర్తింపు వుందని కష్ణా జిల్లా మొదటి అదనపు జిల్లా జడ్జి చిన్నం శెట్టి రాజు అన్నారు. కష్ణాజిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కోర్ట్ ప్రాంగణంలో న్యాయమూర్తులు న్యాయవాదులు న్యాయశాఖ సిబ్బంది కక్షిదారులతో ఏర్పాటు చేసిన జాతీయ లాడే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రాజ్యాంగాన్ని గౌరవించాలన్నారు. బిఆర్ అంబేద్కర్ ఆధ్వర్యంలో ఎందరో మేధావులు ఒకే వేదికపై చేరి సమకూర్చిన రాజ్యాంగం భారత రాజ్యాంగం అని ప్రపంచ దేశాలలో భారతదేశానికి ఒక గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. కష్ణాజిల్లా పర్మనెంట్ లోక్ అదాలత్ చైర్మన్ విశ్రాంత జిల్లా జడ్జి డాక్టర్ రామకష్ణ భారత రాజ్యాంగంలోని ముఖ్య అంశాలను తెలియజేశారు. న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రామకష్ణయ్య, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి పద్మ, సీనియర్ న్యాయవాది బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ, పలువురు న్యాయమూర్తులు పాల్గొన్నారు.**ప్రజాశక్తి-బంటుమిల్లి :** స్థానిక సెయింట్ జోన్స్ హై స్కూల్‌లో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వమించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ సాబుజాన్, హెడ్ మిస్సెస్ ఝాన్సీ సాబు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎన్నికలపై అవగాహన కలిగించుట కొరకు విద్యార్థులచే మోడల్ ఎలక్షన్స్ నిర్వహించారు. సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులు స్టీవెన్ విక్టర్ బాబు, నాగమణి, రవికుమార్ పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డిల్లీరావు

లింగ వివక్ష మహిళాభివృద్ధికి ఆటంకం

- ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు
- వివక్షకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ

ప్రజాశక్తి - భవానీపురం : లింగ వివక్ష మహిళాభివద్ధికి ఆటంకమని, చట్టాలను అమలు చేయడం ఎంత ముఖ్యమో సమాజంలో మార్పు రావడం కూడా అంతే ముఖ్యమని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. డిల్లీరావు అన్నారు. స్త్రీలపై హింసను నియంత్రించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులై లింగ వివక్షను సమర్థవంతంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ మరియు జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో 'జెండర్ ఆధారిత హింస'కు వ్యతిరేకంగా శనివారం గొల్లపూడి సచివాలయం నుండి మహిళలతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కలెక్టర్ డిల్లీరావు ప్రారంభించి మాట్లాడుతూ స్త్రీ, పురుషుల మధ్య వివక్షత లేని నాడు నాగరికతతో కూడిన ఉత్తమ సమాజం ఏర్పడుతుందన్నారు. లింగ వివక్ష లేని సమాజం ఏర్పాటులో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులవుదామని ప్రతిన బూనాలన్నారు. లింగ వివక్ష సమాజం, మహిళాభివద్ధికి ఆటంకం అవుతుందన్నారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న లైంగిక, శారీరక, మానసిక హింసకు వ్యతిరేకంగా బాధ్యత కలిగిన ప్రతి ఒక్కరూ స్పందించాలన్నారు. తొలుత కూతురు కొడుకు అనే తారతమ్యం లేకుండా విద్య, అభివృద్ధిలో సమాన అవకాశలు కల్పిస్తామని, బాల్య, బలవంతపు వివహాలు, గృహ హింసను వ్యతిరేకిస్తామని మహిళలో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం స్త్రీలకు తగిన గౌరవం ఇస్తామని వారి హక్కుల కోసం నిలబడతామని, మహిళలపై హింస సామాజిక భాధ్యత స్వీకరిస్తామని, మహిళల హక్కులను వియోగించుకునేలా కృషి చేసి సురక్షితమైన వాతావరణం కల్పిస్తామని హింసకు వ్యతిరేకంగా చేపట్టే కార్యక్రమంలో భాగస్వామ్యం అవుతామని పురుషులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో డిఆర్‌డిఏ పీడీ కె. శ్రీనివాసరావు, డ్వామా పీడీ జె.సునీత, ఐసిడిఎస్ పీడీ జి.ఉమాదేవి, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.నాగమణెమ్మ, రూరల్ మండల యంపిడివో జాహ్నవి, జిల్లా సమైఖ్య అధ్యక్షురాలు కె.సీత, కార్యదర్శి కె.రాణి, ఐసిడిఎస్ సిడిపివోలు జి.మంగమ్మ, కె.నాగమణి, జిల్లా సమైఖ్యసభ్యులు, స్వయం సహాయక బృందాల మహిళలు పాల్గొన్నారు.

డెకాయ్ ఆపరేషన్లను విస్తృతం చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - విజయవాడ : జిల్లాలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలుచేసేందుకు జిల్లాస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఎస్.డిల్లీరావు అధికారులను ఆదేశించారు. డెకాయ్ ఆపరేషన్లను విస్తతంగా నిర్వహించాలన్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో లింగ నిర్ధారణ నిషేధ చట్టం-1994 అమలుపై జిల్లాస్థాయి మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ, సలహా కమిటీ సమావేశం కలెక్టర్ డిల్లీరావు అధ్యక్షతన శనివారం జరిగింది. జిల్లాలో చట్టం అమలు తీరుపై సమావేశంలో చర్చించారు. స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్, రెన్యువల్, డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలు తదితరాలకు సంబంధించిన వివరాలను అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 17 ప్రభుత్వ, 268 ప్రైవేటు మొత్తం 285 అల్ట్రాసౌండ్ స్కానింగ్ కేంద్రాలు రిజిస్టర్ అయి ఉన్నాయని, ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి నవంబర్ 20 వరకు 39 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించారని పేర్కొన్నారు. ఇకపైనా ఈ డెకాయ్ ఆపరేషన్లను విస్తతం చేయాలని సూచించారు. విజయవాడ డివిజన్ పరిధిలో 248, నందిగామ డివిజన్ పరిధిలో 16, తిరువూరు డివిజన్ పరిధిలో 21 స్కానింగ్ కేంద్రాలున్నాయన్నారు. సమావేశంలో చట్టపరమైన నిబంధనలను పాటిస్తూ కొత్తగా 7 స్కానింగ్ సెంటర్ల రిజిస్ట్రేషన్‌కు, 8 రెన్యువల్ దరఖాస్తులకు, రిజిస్టర్డ్ సర్టిఫికెట్లలో మార్పులకు సంబంధించి 19 దరఖాస్తులు రాగా వాటిని కమిటీ సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించి ఆమోదం తెలిపారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, అడిషనల్ డీసీపీ పి.వెంకటరత్నం, వాసవ్య మహిళా మండలి చైర్ పర్సన్ రేష్మి, డీసీహెచ్ఎస్ డా. బీసీకే నాయక్, డీపీఎంవో డా. నవీన్ తదితరులు హాజరయ్యారు.

ఆందోళనలో ధాన్యం రైతు

వీక్షణం

రైతులు మాగాణుల్లో వరి కోతకు వచ్చే సమయంలోనే వరుసగా బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనాలతో ఆకాశం మేఘావృతమై ఉంటోంది. అక్కడక్కడా చెదురుమదురు జల్లులు కురుస్తున్నాయి. ఖరీఫ్ ధాన్యం చేతికొచ్చే సమయంలో చోటు చేసుకుంటున్న వాతావరణ మార్పులు రైతులను కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికందుతుందో లేదో అని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. హార్వెస్టింగ్ అయిన ధాన్యం ఆరబెట్టకుండానే అమ్ముకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలోనే ధాన్యంలో తేమశాతం ఎక్కువ ఉందనే కారణాన్ని చూపి 75 కిలోల బస్తాకు తొమ్మిది కిలోల వరకు వ్యాపారులు, రైస్ మిల్లర్లు అదనం ధాన్యం తీసుకుంటున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరలో బస్తాకు రూ. 300 కోత పెడుతున్నారు. జిల్లాలో వరి ప్రధాన పంటగా సాగవుతోంది. 2023-24 ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలోని 3 లక్షల 49 వేల ఎకరాలకుపైగా విస్తీర్ణంలో వివిధ రకాల వరి సాగయింది. బిపిటి మినహా ఇతర రకాలు 8.75 లక్షల టన్నులు ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. జులై నెలాఖరు, అగస్టు మొదటి వారంలో నాట్లు పడిన ప్రాంతాల్లో వరి పంట కోతకు వచ్చింది. తాజాగా వాతావరణంలో మార్పులతో మనుషులతో కోతకోసే పద్ధతిని అనుసరించడానికి రైతులు వెనుకంజ వేస్తున్నారు. హార్వెస్టింగ్ యంత్రాలతో కోత నూర్పిడి పూర్తి చేస్తున్నారు. తేమశాతం 17 ఉన్న 75 కిలోల కామన్ రకం ధాన్యం బస్తాకు రూ.1637, ఏ గ్రేడ్ రకం రూ. 1652కు కనీస మద్దతు ధరలను ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వం నిర్ణయించిన తేమశాతం నిబంధనకు అనుగుణంగా ధాన్యం సిద్ధం చేయాలంటే హార్వెస్టింగ్ పూర్తయిన నాలుగు రోజులు ధాన్యాన్ని ఆరబెట్టాలి. వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో హార్వెస్టింగ్ పూర్తయిన వెంటనే రైతులు పచ్చి ధాన్యాన్ని విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. హార్వెస్టింగ్ పూర్తయిన ధాన్యంలో 26 శాతం వరకు తేమ ఉంటోంది. ఆర్బీకెల ద్వారా విక్రకయించిన ధాన్యానికి ప్రభుత్వం నిర్ణయించిన 17 శాతం తేమకు అదనంగా ఉన్న ఒక్కో పాయింట్‌కు ఒక కిలో ధాన్యం తరుగుగా మిల్లర్లు తీసుకుంటున్నారు. 26 శాతం వరకు పచ్చి ధాన్యంలో తేమ ఉంటోంది. 75 కిలోల బస్తాకు 9 కిలోల ధాన్యం మిల్లర్లు అదనంగా తీసుకుంటున్నారు. కామన్ రకం ధాన్యం బస్తాకు రూ. 196.47, ఏ గ్రేడ్ ధాన్యం బస్తాకు రూ. 198.27 చొప్పున అదనంగా ధాన్యాన్ని మిల్లర్లు తీసుకుంటున్నారు. తేమశాతం ఆధారంగా తీసుకుంటున్న అదనపు ధాన్యంలో సగం (పాయింట్‌కు అరకిలో) చొప్పున 4.5 కిలోలు ఆరబెడితే తరుగా వస్తుందని రైతులు చెబుతున్నారు. మరో 4.5 కిలోలు ధాన్యం అదనంగా మిల్లర్లు తీసుకుంటున్నారని వాపోతున్నారు. శాస్త్రీయం పద్దతిలో తరుగు నిర్ణయించాలని, తాము నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

- రాంబాబు

ఆధునిక వైద్యంతో కీళ్ల సమస్య దూరం

మాట్లాడుతున్న డాక్టర్ సత్యనారాయణ

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : తుంటికీలు అరిగిపోవడం, బిగుసుకు పోవడంతో జీవితం బాధాక రంగా మారు తుందని, ఆధునిక వైద్య శాస్త్రం తుంటికీలు మార్పిడితో జీవితంలోనే గొప్ప మార్పు తీసుకువచ్చిందని ప్రముఖ ఎముకల, కీళ్ల శస్త్ర వైద్య నిపుణులు డాక్టర్ కె.వి.సత్యనారాయణ అన్నారు. బెంజిసర్కిల్ వద్ద గల వాసవ్య నర్సింగ్‌హోమ్‌లో శనివారం 'తుంటికీలు మార్పిడి ఆపరేషన్' అనే అంశంపై ఆరోగ్య సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సత్యనారాయణ మాట్లాడుతూ తుంటికీలు మార్పిడనేది జాయింట్ బిగుసుకుపోయిన వారిలోనూ, పాడైపోయిన వారిలోనూ, ఎముకల్లో రక్తప్రసరణ లేక బలహీనమైపోయిన వారిలోనూ, జాయింట్‌కి చీము పట్టిన వారిలోనూ, జాయింట్‌కి క్షయ వ్యాధి వచ్చిన వారిలోనూ, పుట్టుకతోనే జాయింట్ పటుత్వం లేక జారిపోతున్న వారిలోనూ, జాయింట్‌లో కంతులు వచ్చిన వారిలోనూ అవసరం అవుతుందని అన్నారు. ఇపుడు తుంటికీలు మార్పిడితో ఆపరేషన్ అయిన రెండో రోజు నుండే అడుగులు వేయడం, మొదలై, కొద్ది రోజుల్లోనే వ్యక్తి తన పనులు తాను చక్కగా చేసుకునే స్థితి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ వైద్యులు డాక్టర్ మారు అధ్యక్షత వహించారు.

మహిళలు సమస్యలపై ధైర్యంగా పోరాడాలి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : మహిళలు అన్ని విధాలుగా హింసకు గురవుతున్నారని, చట్టాలు పటిష్టంగా అమలు పరచాల్సిన అవసరం ఎంతయినా ఉందని సామాజిక వేత్త పి.ఎ.దేవి అన్నారు. సేఫ్ (స్టెప్ ఎ హెడ్ ఫర్ ఈక్వాలిటీ) – సిద్ధార్థ మహిళా కళాశాల సంయుక్తంగా మహిళలు, బాలికలపై జరిగే హింసా నివారణకు అందరూ ఐక్యం కావాలన్న అంతర్జాతీయ పిలుపుమేరకు శనివారం లబ్బీపేటలోని కళాశాల ఆవరణలో సెమినార్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న దేవి మాట్లాడుతూ నేటి సమాజంలో స్త్రీలు, అనేక సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యాపరంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. బాల్య వివాహాలు, వరకట్న వేధింపులు, వర్ణ వివక్షతతో కూడిన హింస, లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణ హత్యలు, పరువు హత్యలు ఇలా వివిధ రూపాల్లో మహిళలపై హింస జరుగుతుందన్నారు. మహిళలపై భౌతికంగానే కాదని, ఆన్‌లైన్‌లోనూ వేధింపులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గృహ హింసకి సంబంధించి జాతీయ మహిళా కమీషన్ వాట్సాప్ నెంబర్ 72177 35372తో పాటు ఆసంస్థ వెబ్‌సైట్‌లోనూ ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో బాధితులు ఎవరైనా 181, 1091, 100 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేస్తే తక్షణం పోలీస్ సాయం అందుతుందన్నారు. సేఫ్ కన్వీనర్ జి.జ్యోత్స్న మాట్లాడుతూ మహిళలకు సంబంధించి ఎంతో మంది ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారని, కాని అవి బయటకు చెప్పలేకపోతున్నారని అన్నారు. మహిళలు, విద్యార్థినులు వారి సమస్యలు ఎలా ఎదుర్కోవాలో వివిధ సదస్సుల ద్వారా సేఫ్ వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ టి.విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.కల్పన, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కె.సరళ, ప్రముఖులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సామాజిక వేత్త పి.ఎ.దేవి

అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలి

జాబ్‌మేళా నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : అందివచ్చిన అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి దేవరపల్లి విక్టర్ బాబు అన్నారు. శనివారం విజయవాడలోని ఐటిఐ ప్రాంగణంలో ఉన్న జిల్లా ఉపాధి కల్పన కార్యాలయ అవరణలో స్కిల్ డెవలప్మెంట్ సంస్థ, ఉపాధి కల్పన శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా నిరుద్యోగ యువతను ఉద్దేశించి విక్టర్ బాబు మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు ప్రభుత్వం అధ్వర్యంలో అనేక సంస్థలతో చర్చలు జరిపి నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు విశేష కృషి చేస్తున్నామని తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి శాఖ అధికారి ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యాభ్యాసం పూర్తి చేసుకొని భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు యువత ముందుకు రావాలన్నారు. ఉపాధి కల్పన ప్రాంతీయ అధికారి ఎం.రామోహన్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను మెండుగా కల్పించేందుకు ఈ జాబ్ మేళాలో 165 మంది అభ్యర్థులు పాల్గొన్నారని అందులో 36 మందిని ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేసి వివిధ సంస్థల్లో ఉద్యోగాలు పొందిన వారికి యంగ్ ప్రొబేషన్ ఎన్.జయరాజు చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్లేస్మెంట్ అధికారి మధు, ఉపాధి కార్యాలయ సిబ్బంది, చందన, మౌనిక వివిధ సంస్థల ప్రతినిధులతో పాటు పెద్ద సంఖ్యలో నిరుద్యోగులు పాల్గొన్నారు.

స్నానఘాట్లను పరిశీలిస్తున్న దృశ్యం

స్నానఘాట్ల పరిశీలన

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరిం చుకొని ఇబ్రహీం పట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని గుంటుపల్లి తుమ్మల పాలెం సంగమం ఫెర్రీ, దాము లూరు మొదలైన స్నానపు ఘాట్లను విజయ వాడ క్రైమ్ ఎడిసిపి వెంకట రత్నం శనివారం సందర్శిం చారు. ఇబ్రహీం పట్నం పవిత్ర సంగమం, తుమ్మలపాలెం గుంటు పల్లి దాములూరు స్నానఘాట్లలో ఏర్పాట్లు పరిశీలించారు. దీనిలో భాగంగా భక్తుల స్నానం చేయుచోట ఫెన్సింగ్ లేని చోట ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, భక్తుల స్నానం చేసేచోట చెత్త,మురుగును తీయించాలని,గజ ఈతగాళ్ల, ఎస్‌డిఆర్ఎఫ్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని తెలిపారు.

మహిళల్లో ప్రశ్నించేతత్వం పెరగాలి

ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నేడు మహిళలు అన్ని విధాలుగా వేధింపులకు గురవుతున్నారని, వాటిని ఎదుర్కొనేందుకు ప్రశ్నించేతత్వం రావాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు అన్నారు. మహిళలపై హింస నివారణకు అందరూ ఐక్యం కావాలనే అంతర్జాతీయ పిలుపు మేరకు ఐద్వా సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో మాచవరంలోని ఎస్ఆర్ఆర్ అండ్ సివిఆర్ ప్రభుత్వ కళాశాలలో శనివారం ఉదయం సెమినార్ జరిగింది. ప్రధాన వక్తగా పాల్గొన్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ రోజు రోజుకూ మహిళలపై వేధింపులు పెరుగుతున్నాయన్నారు. చట్టాలున్నా అవి పటిష్టంగా సమర్థవంతంగా అమలు కావడం లేదన్నారు. ముఖ్యంగా ప్రభుత్వాలు మహిళల రక్షణకు సంబంధించి అనేక విధాలుగా చెప్తున్నా నేడు ఎక్కడో ఒకచోట రోజూ ఏదో ఒక సంఘనట మహిళలపై జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఆర్ఆర్ అండ్ సివిఆర్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రతి మహిళా విద్యా వంతురాలు అవ్వాలని అపుడే సమాజంలో వచ్చే అనేక సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కోనగలదని అన్నారు. ఐద్వా ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి కె.శ్రీదేవి మాట్లాడుతూ నేడు మహిళలు పని ప్రదేశాలలోనూ అన్ని చోట్ల అవమానాలకు గురికావాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. మహిళలు ప్రశ్నించడంతో పాటు సమాజంలో సంఘటనలను ధైర్యంగా ఎదుర్కొవాలన్నారు. ఈ కారకయక్రమంలో ఐద్వా సెంట్రల్ సిటీ కమిటీ అధ్యక్షురాలు కె.సరోజ, సభ్యులు షకీల, ఆశా పలువురు పాల్గొన్నారు.

సూర్యదేవర సుబ్బారావు సేవలు శ్లాఘనీయం

ఎంఎల్ఎ మొండితోక జగన్మోహన్‌రావు

సూర్యదేవర సుబ్బారావుకు నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ జగన్ మోహన్‌రావు

ప్రజాశక్తి - నందిగామ : కెవిఆర్ కాలేజి రిటైర్డ్ లెక్చరర్, న్యాయనాది సూర్యదేవర సుబ్బారావు సేవలు శ్లాఘనీయంమని నందిగామ ఎంఎల్ఎ మొండితోక జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. శనివారం నందిగామ పట్టణంలోని 10వ వార్డులో కె.వి.ఆర్.కాలేజ్ విశ్రాంత అధ్యాపకులు సూర్యదేవర సుబ్బారావు సంస్మరణ కార్యక్రమంలో శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రత్నరాజును అభినందిస్తున్నకెబిఎన్ కళాశాల యాజమాన్యం

రోలర్ స్కేటింగ్ పోటీలకు కెబిఎన్ విద్యార్థి

ప్రజాశక్తి - భవానీపురం : తమ కళాశాల విద్యార్థి రత్నరాజు ఇటీవల రోలర్ స్కేటింగ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయం సాధించి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు కేబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు తెలిపారు. తమ కళాశాల విద్యార్థి మొదటి ఏడాది బీకాం చదువుతున్న రత్నరాజు జిల్లా స్థాయిలో మూడు గోల్డ్ మెడల్స్‌ను సాధించి ఇటీవల విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి రోలర్స్ స్కేటింగ్‌లో బంగారు, కాంస్య, రజిత పతకాలను సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం కళాశాలలో విద్యార్థినికి అభినందన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రిన్సిపాల్ నారాయణరావు మాట్లాడుతూ త్వరలో చెన్నైలో జరగబోయే జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు కూడా రత్నరాజు ఎంపిక కాబడ్డాడని తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం
పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...
మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218
విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.